RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 173 శనివారం 19 జూలై 2025 పేజీలు : 4

## శాంతిని నెలకొల్పాలి: మోదీ

న్యూఢిల్లీ : ప్రధాని మోదీకి ఇరాన్ అధ్యక్షుడు పేజేష్కియాన్ ఫోన్ చేశారు. ఈ సందర్భంగా ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలపై మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇరువర్గాలు దౌత్య మార్గాలు, చర్చల ద్వారా పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పి, భద్రత, సుస్థిరతను స్థాపిం చాలని ఆకాంక్షించారు. ఈ మేరకు మోదీ ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. ఇరాన్‌పై అమెరికా దాడిపై ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే విస్ఫోటనం అంచున ఉన్న ప్రాంతంలో ఉద్రిక్తతలను పెంచడం వల్ల అంతర్జాతీయ శాంతి, భద్రతకు ముప్పు వాటిల్లుతుందని అభిప్రాయపడ్డారు. మరో వైపు, అమెరి కా దాడుల నేపథ్యంలో ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్ వద్ద ఎలాంటి రేడియేషన్ లీకేజీ లేదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ) చీఫ్ రాఫెల్ గ్రాసీ ప్రకటించారు. ఇరాన్‌పై అమెరికా దాడిని పాకిస్థాన్ కూడా ఖండించింది. తనను తాను రక్షించుకునే హక్కు ఇరాన్‌కు ఉందని స్పష్టం చేసింది.

# కేసీఆర్ వల్లే పాలమూరు ప్రాజెక్టు పూర్తి కాలే: రేవంత్ రెడ్డి




నాగర్ కర్నూల్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి చేయడంలో తన నిబద్ధతను ప్రకటించారు. ఈ ప్రాజెక్టుతోపాటు దిండి, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి కీలక ప్రాజెక్టులను అడ్డుకునే ప్రయత్నాలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ రద్దు చేసుకోవాలని, అందుకు సహకరించాలని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. సహకారం లేకపోతే పోరాటం తప్పదని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడం తన బాధ్యత అంటూ స్పష్టం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం జటప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.

**మరో పదేళ్లు నేనే సీఎం..** అంతేకాదు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ని ఉద్దేశిస్తూ 'నీ గుండె, నీ కుమారుడి గుండె మీద కూడా రాసుకో.. మరో పదేళ్లు నేనే సీఎంగా ఉంటా' అని రేవంత్ పేర్కొన్నారు. ఈ పాలమూరు బిడ్డే తెలంగాణను ప్రజా ప్రభుత్వంతో నడిపిస్తాడని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను అసెంబ్లీకి రావాలని, ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి నేర్చుకోవాలని హితబోధ చేశారు రేవంత్. 'నీకు దుఃఖమొస్తే ఏడ్చినా, బావిలో దూకినా, నీ ఇష్టం' కానీ తెలంగాణ ప్రజల కోసం తాము చేసే మంచి పనులను చూస్తూ ఉండాలని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పాలమూరు ప్రాంతం సస్యశ్యామలంగా మారి, రైతుల జీవనోపాధికి బలమైన ఆధారంగా నిలుస్తాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

**రూ.200 కోట్ల వ్యయంతో...** నాగర్‌కర్నూల్ జిల్లా జటప్రోలులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా పాలమూరు ప్రాంత అభివృద్ధికి కొత్త ఊపిరి లభించింది. ఈ సందర్భంగా రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన జరిగింది. ఈ స్కూల్ విద్యార్థులకు ఆధునిక విద్య, సౌకర్యాలతో ఉజ్వల భవిష్యత్తును అందించనుంది.

ఈ సందర్భంగా కొల్లాపూర్ అభివృద్ధికి అవసరమైన నిధులను పూర్తిగా అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

**పాలమూరు పట్ల కేసీఆర్‌కు చిన్నచూపు...** గతంలో కేసీఆర్ నాయకత్వంలో పాలమూరు పట్ల నిర్లక్ష్యం జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్.. పాలమూరు ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. వరద బాధితులకు ఇళ్లు కట్టిస్తానని చెప్పిన కేసీఆర్.. ఆ హామీని ఎందుకు నెరవేర్చలేదన్నారు. రూ.25వేల కోట్లు ఖర్చు చేసి ఉంటే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఇప్పటికే పూర్తయ్యేదన్నారు రేవంత్. అదే సమయంలో రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం మూడేళ్లలో కూలేశ్వరంగా మారిందని ఎద్దేవా చేశారు.

**ప్రాజెక్టులకు కొత్త ఊపు...** ఈ సందర్భంగా సీఎం రేవంత్, పాలమూరు ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. డిసెంబర్‌లోగా భూసేకరణ పూర్తి చేసి, కృష్ణా జలాలను పొలాలకు తీసుకొస్తామని అన్నారు. 'మా పొలాల్లో కృష్ణా నీళ్లు పారుతుంటే, కొందరు దీనిని ఓర్చుకోలేకపోతున్నారు. కేసీఆర్ లాంటి వాళ్లు విషం చిమ్ముతున్నారని' రేవంత్ వ్యాఖ్యానించారు. పాలమూరు పచ్చగా మారితే, రైతులు సంతోషంగా ఉంటారని, అది కొందరికి కడుపుమంటగా ఉందని మండిపడ్డారు.

**రైతులకు రుణమాఫీ, బోనస్...** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రూ.21వేల కోట్ల రైతు రుణమాఫీ చేసినట్లు సీఎం రేవంత్ తెలిపారు. 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేశామని, వరి పండించిన రైతులకు బోనస్ కూడా ఇస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు ఉండదని కొందరు అన్నారని, కానీ తాము 24 గంటలూ ఉచిత కరెంటు ఇస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**మహిళల సాధికారతకు పెద్దపీట...** మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, వెయ్యి బస్సులకు మహిళలను యజమానులుగా చేశామని అన్నారు. రూ.21వేల కోట్ల వడ్డీ లేని రుణాలు, పెట్రోల్ బంక్‌లకు యజమానులుగా, సోలార్ విద్యుత్ కాంట్రాక్టులు ఇచ్చి మహిళలను సాధికారత వైపు నడిపిస్తున్నామని వివరిం చారు. కేసీఆర్ తన బిడ్డకు బంజారాహిల్స్‌లో బంగ్లా కట్టించారు. కానీ తాము తెలంగాణ ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తామని రేవంత్ హామీ ఇచ్చారు.

**దళితులు, ఆదివాసీలకు న్యాయం...** కేసీఆర్ హయాంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ హామీలు నెరవేరలేదని రేవంత్ విమర్శించారు. వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కేసీఆర్ చెప్పి, ఎందుకు చేయలేదన్నారు. దళిత బిడ్డలు చదువుకుంటే, రాజ్యాలు ఏలితే కొందరికి దుఃఖం వస్తోందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగ కులాల వర్గీకరణ చేసి న్యాయం చేసిందని రేవంత్ తెలిపారు. 2035 నాటికి తెలంగాణను ట్రిలియన్ ఎకానమీగా మార్చే లక్ష్యంతో పనిచేస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. పాలమూరు పచ్చగా మారాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ లక్ష్యం కోసం కృషి చేస్తోందని సీఎం స్పష్టం చేశారు. పాలమూరు ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. రైతులకు రుణమాఫీ, మహిళలకు సాధికారత, ప్రాజెక్టుల పూర్తితో పాలమూరు కొత్త ఒరవడిని సాధిస్తుందని రేవంత్ హామీ ఇచ్చారు.




## వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ సమస్యకు పరిష్కారం..త్వరలోనే

హైదరాబాద్: ఆ నాటి ప్రధాని పీవీ నరసింహా రావు హయాం నుంచి వరంగల్‌లో కోచ్ ఫ్యాక్టరీ కావాలని అనేక పోరాటాలు జరిగాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుర్తుచేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కోచ్ ఫ్యాక్టరీ సమస్య పరిష్కారం కాబోతుందని తెలిపారు.

రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కి ప్రధాని మోదీ భూమి పూజ చేశారని.. రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ 60 శాతం పనులు పూర్తి అయ్యాయని అన్నారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రేపు (శనివారం) రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూ నిట్ పనుల పురోగతిని పరిశీలిస్తారని చెప్పారు. రైలు ఇంజన్, కోచ్, వ్యాగన్స్ ఉత్పత్తి అయ్యేలా ప్లాన్ చేస్తున్నామని.. ముందుగా రైలు ఇంజన్ తయారీ చేయాలని నిర్ణయించామని కేంద్రమంత్రి అన్నారు. రాదు అనుకున్న పరిశ్రమను మోదీ తెలంగాణకు ఇచ్చారని చెప్పుకొచ్చారు. వరంగల్‌కు మెగా టెక్స్‌టైల్ పార్క్ తీసుకురావడం జరిగిందన్నారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పాలకులు మాత్రం హైదరాబాద్ చుట్టే ఆలోచన చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు.

## అమరావతి దశ దిశ మారుతోంది!

## ఏపీలోనూ హైటెక్ సిటీ..




హైదరాబాద్/అమరావతి : ఇప్పటి వరకూ హైటెక్ సిటీ అంటే హైదరాబాద్ అనేదే అందరికీ తెలిసిన విషయం. దేశంలోనే అగ్రగామి గా ఐటీ రంగాన్ని చాటిన నగరంగా హైదరాబాద్ పేరు దక్కించుకుంది. కానీ ఇప్పుడు ఆ స్థానం మారబోతోంది. ఎందుకంటే.. ఆంధ్రప్రదేశ్ లోనూ ఇప్పుడు ఓ అద్భుతమైన హైటెక్ సిటీకి బీజం పడింది. అమరావతి ఔటర్ రింగ్ రోడ్ చుట్టూ ఒక ప్రపంచస్థాయి హైటెక్ క్లస్టర్‌ను నిర్మించేందుకు స్వర్ణాంధ్ర-2047 టాస్క్‌ఫోర్స్ సూచించింది.

**అమరావతిలో ఐటీ, ఎలక్ట్రానిక్స్‌కు నూతన అడుగు...** తెలుగువారి కలల రాజధాని అమరావతి ఇప్పుడు పరిపాలన కేంద్రంగా మాత్రమే కాకుండా, టెక్నాలజీ అభివృద్ధికి కేంద్రబిందువుగా మారబోతోంది. ఈ హైటెక్ సిటీ ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్ తయారీ, డేటా సెంటర్లు వంటి రంగాలపై దృష్టి పెట్టనుంది. మరో మాటలో చెప్పాలంటే, ఇకపై యువతకు హైదరాబాద్ కాకుండా అమరావతే కొత్త అవకాశాల స్థావరంగా మారనుంది.

**హైటెక్ హబ్‌కు నాంది పలికిన స్వర్ణాంధ్ర టాస్క్‌ఫోర్స్...** ఈ ప్రతిపాదనకు ప్రత్యేకత ఏమిటంటే, దీనికి నాయకత్వం వహించేవారు సాధారణ వ్యక్తులు కాదు. స్వర్ణాంధ్ర 2047 టాస్క్‌ఫోర్స్‌కు సిఎం చంద్రబాబు నాయుడు, టాటా గ్రూప్ అధినేత ఎన్. చంద్రశేఖరన్లు సహ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. ఈ ఇద్దరి అనుభవం, పారదర్శకత, దూరదృష్టి కలిస్తే.. అమరావతిలోని హైటెక్ సిటీపై యువత ఎన్నో ఆశలు ఉంచారని చెప్పవచ్చు.

**హైదరాబాద్ స్థాయిలో.. ఇంకా అంతకుమించి!...** ఇప్పటి వరకూ హైదరాబాద్ హైటెక్ సిటీగా ఎదగడంలో, అక్కడి మౌలిక సదుపాయాలు, పాలసీలు ప్రధాన పాత్ర పోషించాయి. కానీ అమరావతి ORR చుట్టూ నిర్మించనున్న హైటెక్ సిటీ ఇంకా ముందున్న 30 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా నిర్మించనుంది. అంటే ఇది కేవలం ప్రస్తుతానికి కాకుండా, భవిష్యత్తులోకి చూస్తూ రూపొందించబడి ఉంది. ఇందులో డీప్ టెక్, బయోటెక్, క్వాంటం కంప్యూటింగ్, డేటా ప్రాసెసింగ్ సెంటర్లు వంటి విభాగాలకు పెద్ద పీట వేయనున్నారు.

**యువతకు వేల కొద్దీ ఉద్యోగాలు.. ఇక మైగ్రేషన్‌కు సెలవు...** ఇప్పటి వరకూ ఏపీ యువత ఐటీ ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగళూరు, పుణె వంటి నగరాలకు వలస వెళ్తున్నారు. కానీ ఇప్పుడు అది అవసరం లేకుండా పోవచ్చు. అమరావతిలోనే ప్రపంచస్థాయి కంపెనీలు క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే, వాళ్ల ఊరిలోనే కార్పొరేట్ ఉద్యోగాలు దక్కే అవకాశం ఉంది. దీని వల్ల రాష్ట్రానికి పెట్టుబడులు రావడమే కాక, స్థానిక అభివృద్ధి, జీవన ప్రమాణాల పెరుగుదల, విద్యారంగానికి మద్దతు వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయి.

**అమరావతికి కొత్త ఒరవడి.. ఒకే ప్రదేశంలో పాలన, టెక్నాలజీ...** తెలుగు రాష్ట్రాల్లో పాలనకి ఒక దిశ, టెక్నాలజీకి మరో దిశ ఉండేది. కానీ ఇప్పుడు ఆ రెండూ ఒకే చోట కలవబోతున్నాయి. అమరావతిలో ఒకవైపు పార్లమెంటరీ క్యాంపస్‌లు, హైకోర్టు, సచివాలయం, మరోవైపు సాఫ్ట్‌వేర్ కంపెనీలు, హార్డ్‌వేర్ యూనిట్లు, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు.. ఇలా పరిపాలనతో పాటు టెక్ పద్ధతులు కూడిన సమగ్ర అభివృద్ధి జరగనుంది.




# భాగ్యనగరానికి మహర్దశ!

## హైదరాబాద్ చుట్టూ ఔటర్ రింగ్ రైలు..

## రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం..

హైదరాబాద్ : తెలంగాణ రవాణా రంగ అభివృద్ధిలో కీలక మైలురాయిగా భావిస్తున్న ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టుకు సంబంధించి తుది లొకేషన్ సర్వే పూర్తి అయింది. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే, రాష్ట్ర రాజధానిని చుట్టూ కొత్త రైల్వే మార్గం ఏర్పడనుండగా, ఇది దేశంలోనే వినూత్న ప్రయత్నంగా నిలవనుంది. ఔటర్ రింగ్ రైలు మార్గం ప్రధానంగా సికింద్రాబాద్‌ను అనుసంధానించే ఆరు రైలు కారిడార్లతో కలిపి రూపొందించనున్నారు. వాటిలో సికింద్రాబాద్-కాజీపేట, వాడి, డోన్, ముర్కడ్, గుంటూరు, కొత్తపల్లి మార్గాలు ఉన్నాయి. ఈ మార్గాలతో అనుసంధానం వల్ల రైల్వే రాకపోకలపై ఉన్న ఒత్తిడి తగ్గుతుంది.

**గూడ్స్ రైళ్లకు ప్రత్యామ్నాయ మార్గం...** ఈ రింగ్ రైలు ఏర్పాటు ద్వారా ముఖ్యంగా గూడ్స్ రైళ్లను నగరానికి రాకుండా బైపాస్ చేయవచ్చు. తద్వారా సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ వంటి ప్రధాన స్టేషన్లపై భారం తగ్గే అవకాశం ఉంటుంది. అంతర్రాష్ట్ర రైళ్లు ఈ కొత్త మార్గం ద్వారా సాఫీగా ప్రయాణించగలవు.

**మూడు ఎలైన్‌మెంట్‌లతో ప్రతిపాదనలు సిద్ధం...** ప్రాజెక్టు కోసం దక్షిణ మధ్య రైల్వే మూడు వేర్వేరు ఎలైన్‌మెంట్‌లను ప్రతిపాదించింది. వాటిలో ప్రతి దానికీ దూరం, వ్యయం, మలుపుల సంఖ్య, టన్నెళ్ల పొడవు వంటి అంశాలపై స్పష్టమైన అంచనాలు రూపొందించారు. వీటిలో దూరం 392 కిలోమీటర్ల నుంచి 511 కిలోమీటర్ల వరకు ఉండే అవకాశముంది.

**నిర్మాణ వ్యయం రూ. 12,000 కోట్ల నుండి రూ. 17,700 కోట్ల వరకు...** ఈ మూడు ప్రతిపాదిత మార్గాల్లో నిర్మాణ వ్యయం రూ.12,070 కోట్ల నుంచి రూ.17,763 కోట్ల వరకు ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టు సాంకేతికత, భౌగోళిక పరిస్థితులు, భూసేకరణ పరిస్థితుల ఆధారంగా ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేయనున్నారు.

**ఎనిమిది నుంచి పది జిల్లాలకు లాభం-** ఔటర్ రింగ్ రైలు మార్గం మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట వంటి జిల్లాలకు అనుసంధానమవుతుంది. కొన్ని ప్రతిపాదనలలో కామారెడ్డి, జనగామ వంటి జిల్లాలూ చేరే అవకాశం ఉంది. దీంతో ప్రజలకు హైదరాబాద్ చేరడం సులభమవుతుంది.

**దేశంలోనే తొలిసారి రింగ్ రైలు ప్రాజెక్టు...** ఇప్పటి వరకు దేశంలో ఎక్కడా నగరాన్ని చుట్టూ పూర్తిస్థాయి రింగ్ రైలు నిర్మించిన దాఖలాలు లేవు. బెంగళూరు, చెన్నై, ముంబయిలో శివార్లకు టెర్మినల్స్ నిర్మించినా, హైదరాబాద్ చుట్టూ రింగ్ రైలు నిర్మాణం మాత్రం దేశంలోనే మొదటిసారి జరగనుంది. ఇది రవాణాలో సరికొత్త దిశగా తీసుకెళ్లే ప్రణాళికగా మారనుంది.

**రైల్వే స్టేషన్ల సంఖ్య 26 నుంచి 34 వరకు...** ఈ రింగ్ రైలు మార్గంలో కనీసం 26 నుంచి గరిష్ఠంగా 34 స్టేషన్లు ఏర్పడే అవకాశం ఉంది. కొత్తగా రైల్వే స్టేషన్లు నిర్మించడం వల్ల స్థానిక రవాణా మెరుగవుతుంది. జిల్లాల మధ్య రైలు ప్రయాణాలు వేగవంతమవుతాయి.

**ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుదలతో ప్రయోజనాలు...** ఈ ప్రాజెక్టు అమలుతో హైదరాబాద్ నగరానికి వచ్చిన రైళ్లను ఔటర్ రింగ్ రైలులో మళ్లించవచ్చు. దీనివల్ల నగరంలోని ప్రధాన స్టేషన్లపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గిపోతుంది. ఇది ఔటర్ రింగ్ రోడ్ తరహాలో నగరానికి బయటే రాకపోకలు నడిపించే అవకాశాన్ని కల్పిస్తుంది.

**తరువాతి దశలో నిర్మాణానికి అడుగులు....** ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తి కావడంతో తదుపరి దశలో ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేసి నిర్మాణానికి అనుమతులు పొందే ప్రక్రియ ప్రారంభం కానుంది. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర రైల్వే శాఖ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని భావిస్తోంది.

# సంపాదకీయం

## ఎయిరిండియా క్రాష్ రిపోర్ట్... సాఫ్ట్ వేర్, టీసీఎంఏ ప్రస్థావన ఏది?

అహ్మదాబాద్ లో జరిగిన ఎయిరిండియా బోయింగ్ 787 విమాన ప్రమాదంపై ప్రాథమిక నివేదికను ఇటీవల ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ నివేదికపై పైలెట్ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేయగా.. మరోవైపు, కాక్ పిట్ లో రికార్డైన సంభాషణల నివేదిక తెరపైకి రావడంతో వేళ్లన్నీ పైలెట్ల వైపు చూపిస్తున్నాయని అంటున్నారు! ఇంధన స్విచ్ ఎందుకు ఆపావంటూ ఒక పైలెట్ అడగడం.. తాను ఆపలేదని మరో పైలెట్ సమాధానం చెప్పడంతో ఇష్యూ చర్చనీయాంశంగా మారింది. ఈ విమానం ఢిల్లీ నుంచి అహ్మదాబాద్ కు వచ్చినప్పుడు అంతా బాగానే ఉంది కానీ అహ్మదాబాద్ నుంచి లండన్ కు వెళ్తుండగా ఎందుకు రెండు స్విచ్ లు ఆగిపోయాయనే చర్చ తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఉద్దేశ పూర్వకంగానే ఇంధన స్విచ్ లు ఆపేశారా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయని అంటున్నారు. మరోవైపు ఇంధన స్విచ్ రన్ నుంచి కటాఫ్ కు ఎందుకు మారిందో నివేదికలో ప్రస్తావించలేని పరిస్థితి!! ఈ నేపథ్యంలో.. అమెరికా విమానయాన నిపుణురాలు మేరీ షియావో స్పందించారు. పైలట్ లపై అనుమానాల వాదనను ఆమె తిరస్కరించారు. అవును... అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనలో పైలెట్లపై పలు అనుమానాల వాదనలు తెరపైకి వస్తోన్న వేళ.. మేరీ షియావోను మీడియా సంప్రదించగా... దీనిపై ఎలాంటి ఆధారాలు లేవని ఆమె వెల్లడించారు. కాక్ పీట్ వాయిస్ రికార్డర్ లో ఉన్న వాయిస్ లను, చిన్న చిన్న శబ్దాలను సైతం జాగ్రత్తగా విశ్లేషించాలని తెలిపారు. పైలట్ ఆత్మహత్య లేదా హత్య అని సూచించడానికి ఇక్కడ ఎలాంటి ఆధారం లేదని ఆమె నొక్కి చెప్పారు. ఈ నేపథ్యంలోనే... ఇంధన స్విచ్ "రన్" నుండి "కటాఫ్" కు దానంతట అదే మారడం ఇదే మొదటిసారి కాదని షియావో ప్రత్యేకంగా ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ కి చెప్పారని నివేదించబడింది. ఐదేళ్ల క్రితం జరిగిన ఘటన తెరపైకి వచ్చింది. ఈ సందర్భంగా స్పందించిన షియావో... 2019 లో ఒక ఆల్ నిప్పాన్ ఎయిర్ వేస్ కు చెందిన బోయింగ్ 787 విమానం నేలపై ఉందని భావించేలా సాఫ్ట్ వేర్ చేసిందని.. దీంతో థ్రస్ట్ కంట్రోల్ మాల్ ఫంక్షన్ అకామడేషన్ సిస్టమ్ ఇంజిన్ లకు ఇంధనాన్ని కట్ చేసిందని దర్యాప్తులో తేలిందని తెలిపారు. ఇదే సమయంలో.. పైలట్లు ఎప్పుడూ ఇంధన కటాఫ్ ను తాకలేదని ఆమె జోడించారు. టోక్యో నుండి ఒసాకాకు బయలుదేరిన ఆ 'ఆల్ నిప్పాన్ ఎయిర్ వేస్' (ఏఎన్ఏ) విమానంలో 109 మంది ప్రయాణికులు, 9 మంది సిబ్బంది ఉన్నట్లు ఆమె వెల్లడించారు. అయితే... బోయింగ్ 787 విమానంలో రెండు ఇంజిన్లు ఉండగా... ఒకే ఇంజిన్ తోనూ ప్రయాణించగలదని.. అయినప్పటికీ ఎయిరిండియా విషయంలో రెండు ఇంజన్లు ఒకేసారి విఫలమయ్యాయని షియావో అన్నారు! ఇదే సమయంలో... ప్రాథమిక నివేదిక పైలట్లపై నింద మోపబడినట్లు ఉన్నప్పటికీ.. తదుపరి దర్యాప్తులో అన్ని విషయాలు చర్చకు రావాలని ఆమె కోరారు! ఏఏఐబీ నివేదికలో థ్రస్ట్ కంట్రోల్ మాల్ ఫంక్షన్ అకామిడేషన్ (టీసీఎంఏ) గురించి ప్రస్థావించలేదని.. దర్యాప్తులో ఇది కూడా చర్చకు రావాలని తాను అనుకుంటున్నట్లు తెలిపారు. సాఫ్ట్ వేర్ కు క్లీన్ చీట్ ఇవ్వలేదని తెలిపారు!

# నీటి వనరు.. కబ్జాలు కనరు



హైదరాబాద్: హైదరాబాద్ మహానగర ప్రజల దాహార్తిని తీర్చే జలాశయాలు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. దాదాపు 1.30 కోట్ల ప్రజలకు జలమండలి 550 ఎంజీడీలే (మిలియన్ గ్యాలన్స్ ఫర్ డే) సరఫరా చేస్తోంది. ఇందులో సుమారు 40 నుంచి 50 ఎంజీడీలు జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల నుంచి తీసుకుంటున్నారు. కీలకమైన ఈ జలశయాలు ఆక్రమణలతో కుంచించుకుపోతున్నాయి.

**తగ్గిన సామర్థ్యం..**

జంట జలాశయాల పరిధిలో నిర్మాణాలు చేపట్టకూడదనే ఆదేశాలున్నాయి. నీటి నిల్వ పరిధి, మరో 100 మీటర్ల వరకు బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేయకూడదు. పరిసర ప్రాంతాల్లోనూ ఎలాంటి కట్టడాలు చేపట్టకూడదని జీవో 111 విడుదల చేశారు. బఫర్‌జోన్ దాటి ఎఫ్‌టీఎల్‌లోనే నిర్మాణాలు చేపట్టారు. రిసార్టులు, అతిథిగృహాలు, కన్వెన్షన్ సెంటర్లు, ఫామ్ హౌస్‌ల పేరుతో వందల నిర్మాణాలు వెలిశాయి. రోజుకు 32 మిలియన్ గ్యాలన్లు సరఫరా చేయాల్సిన హిమాయత్ సాగర్ ప్రస్తుతం 8 ఎంజీడీలే అందిస్తోంది. రోజుకు 18 ఎంజీడీలు అందించాల్సిన గండిపేట నిల్వ సామర్థ్యం 40శాతం తగ్గిపోయింది. హిమాయత్‌సాగర్ పరిధిలో 150 వరకు అక్రమ కట్టడాలను గుర్తించారు. గండిపేట జలాశయం చుట్టూ మరో వందకుపైగా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోని మురుగును నేరుగా జలాశయాల్లోకే వదులుతున్నారు.


అజీజ్‌నగర్, బాకారాం జాగీర్, నాగిరెడ్డిగూడ, శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ, కవ్వగూడ, నర్కూడ పరిధిలో 59.25 ఎకరాలు కబ్జాకు గురైంది.

నీరు కలుషితం కాకుండా అధికారులు పర్యవేక్షించాలి. నివాసాలు, రిసార్టుల నుంచి మలమూత్రాలు, మురుగును వీటిలోకి వదిలేస్తున్నారు. వర్షాకాలంలో చెరువులు పూర్తిగా నిండినా రెండు జలాశయాల నుంచి 25 ఎంజీడీలకు మించి సరఫరా కావడం లేదు.

**జీవో 111 అంటే ఇలాగేనా..?**

జలాశయాలు శుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో 1996లో జీవో 111ను జారీ చేశారు. దీని ప్రకారం జలాశయం చుట్టూ 15 కి.మీ.ల పరిధిలో నిర్మాణాలు నిషేధించారు. కొత్తగా నివాసిత ప్రాంత లేఅవుట్‌లు వేయరాదు. జీవో 111ను కొద్దిగా సవరిస్తూ గత ప్రభుత్వం జీవో 69ను జారీ చేసింది. ఈ పరిధిలో మొత్తం 84 గ్రామాలు ఉన్నాయి. గ్రామాల్లో విచ్చలవిడిగా కొత్త నిర్మాణాలు జరిగాయి. జలాశయాల చుట్టూ రిసార్టులు, గెస్ట్‌హౌస్‌లు వెలిశాయి. నిబంధనలు మాత్రం అమలు కాలేదు. జలాశయాల కబ్జాపై హైడ్రాకు ఫిర్యాదు చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

# పర్యాటక రంగం.. ఆశాభంగం



హైదరాబాద్: భాగ్యనగర పర్యాటకంపై ఉదాసీనత కొనసాగుతోంది. నూతన విధానం అందుబాటులోకి వచ్చినా కార్యాచరణతో ముందుకు సాగడంలేదు. నగరం నుంచి ఓఆర్ఆర్, ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు వివిధ పర్యాటక ఆకర్షణలను అభివృద్ధి చేసే లక్ష్యం కార్యరూపం దాల్చడంలేదు. చార్మినార్, పైగా టూంబ్స్, లాడ్ బజార్, సాలార్‌జంగ్ మ్యూజియం, నిజాం మ్యూజియం, చౌమొహల్లా ప్యాలెస్‌లను అనుసంధానం చేస్తూ చార్మినార్ క్లస్టర్‌ను గోల్కొండ, కుతుబ్‌షాహీ టూంబ్స్, తారామతి బారాదరి, ప్రేమామతిలతో గోల్కొండ క్లస్టర్‌ను అభివృద్ధి చేసే ప్రతిపాదనలపై ఉదాసీనత కొనసాగుతోంది. ఆర్కియాలజీ, కేంద్ర, సాంస్కృతిక శాఖలు, హెచ్ఎండీఏ మధ్య సమన్వయ లోపం సమస్యలకు దారి తీస్తోంది.

**అన్నీ చూడలేక**

నగరంలో అనేక పర్యాటక ఆకర్షణలున్నా కొన్నింటికే ఆదరణ ఉంటోంది. ప్రధానంగా సందర్శకులు చార్మినార్, గోల్కొండ, బిర్లామందిర్, ఎన్టీఆర్ గార్డెన్, హుస్సేన్‌సాగర్‌కు పరిమితమవుతున్నారు. ఎంతో చారిత్రక వారసత్వ సంపద కలిగి ఉన్న మ్యూజియంలు 3 ఉన్నా ఎక్కువమంది వీటిని సందర్శించడం లేదు. సాలార్‌జంగ్ మ్యూజియానికే తాకిడి ఉంటోంది. నిజాం మ్యూజియం ఉందని తెలిసిన వాళ్లే వెళ్తున్నారు. స్టేట్ మ్యూజియానికి సందర్శకులు కరవయ్యారు. పురావస్తుశాఖ కార్యాలయ ఆవరణలోని శ్రీశైలం పెవిలియన్ మూతపడింది. ఎన్టీఆర్ గార్డెన్స్‌లో ఒకప్పటి ఆకర్షణలు లేవు. చాలామంది అటువైపే చూడటం లేదు. లుంబినీ పార్క్, హుస్సేన్‌సాగర్ బోటింగ్‌కు మాత్రం ఆదరణ తగ్గడంలేదు. గోల్కొండకు వెళ్లేవారు విధిగా కుతుబ్‌షాహీ టూంబ్స్‌కు వెళ్లాలనుకున్నా.. అక్కడ కనీస వసతుల్లేవు. బొటానికల్ గార్డెన్, బయోడైవర్సిటీ పార్కు వంటివి స్థానికులకే పరిమితం అయ్యాయి. లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్ పర్యాటకంలో పూర్తిస్థాయిలో అంతర్భాగం కాలేదు. ఇటీవల జరిగిన ప్రపంచ సుందరి పోటీల్లో నగర పర్యాటకానికి ఎంతో ప్రచారం లభించింది. సుందరీమణులు కొన్ని ప్రాంతాలనే చూశారు. మెడికల్ టూరిజంలో పర్యాటకశాఖ పాత్ర నామమాత్రమేనని చెప్పొచ్చు.

# టోకెన్ సేకరించి.. టోకున తరలించి



రామడుగు: రామడుగు మండలంలోని మోతెవాగు నుంచి ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. కార్యదర్శులు లబ్ధిదారులకు జారీ చేసిన టోకెన్లను సేకరించి.. అక్రమ దందా కొనసాగిస్తున్నారు. కోరిటపల్లి, షానగర్, గోలిరామయ్యపల్లి, రుద్రారం, మోతె, వన్నారం, కొక్కెరకుంట గ్రామాల్లోని మోతె వాగు నుంచి ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వుతున్నారు. రామడుగు నుంచి పెగడపల్లి, కోరిటపల్లి నుంచి గంగాధర, వన్నారం నుంచి కొత్తపల్లి, కరీంనగర్ మండలాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**ముందు బైక్.. వెనుక ట్రాక్టర్..**

రామడుగు మండలంలోని మోతెవాగు నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారంతా ట్రాక్టర్‌కు ముందు బైకును పంపిస్తారు. ఎక్కడా ఇబ్బంది లేదని చెబితే.. ముందుకెళ్తారు. ఎక్కడైనా పోలీసులు, అధికారులు తనిఖీలు జరిగినట్లు కనిపిస్తే.. బైక్ వాళ్లు వెనుక వచ్చే ట్రాక్టర్‌ను అప్రమత్తం చేస్తారు. ఇలా అధికారులకు చిక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. రోజుకు సుమారు వంద ట్రాక్టర్లు మోతె వాగు నుంచి తరలిపోతున్నాయి.

నిత్యం అక్రమ రవాణాకు పాల్పడేందుకు ఆయా గ్రామాల మలుపు వద్ద కొంతమందితో నిఘా ఏర్పాటు చేసుకొని దర్జాగా అక్రమాలకు పాల్పడుతున్నారు. పోలీసు వాహనం స్టేషన్ నుంచి బయలుదేరగానే నిఘా యువకులు సెల్‌ఫోన్ల ద్వారా ట్రాక్టర్ డ్రైవర్లకు సమాచారం ఇవ్వడంతో ఎవరికీ చిక్కకుండా పోతున్నారు.

**అనుమతికి మించి..**

మండలంలో 523 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. దీని కోసం ఇసుకను ఉచితంగా అందజేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఒక్కో ఇంటికి వివిధ దశల్లో 25 క్యూబిక్ మీటర్ల(పది ట్రాక్టర్లు) ఇసుకను ప్రభుత్వం అనుమతించింది. లబ్ధిదారుల పేరిట పంచాయతీ కార్యదర్శులు టోకెన్లు జారీ చేశారు. వీటిని సేకరించి ట్రాక్టర్ల యజమానులు పక్క మండలాలకు ఇసుకను తరలిస్తున్నారు. మోతె వాగుకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో ఎక్కడా అధికారుల తనిఖీ లేకపోవడంతో అక్రమ రవాణాదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

లబ్ధిదారుల ఇళ్ల వద్దకు తరలించేందుకు రవాణా ఖర్చు కింద రూ.వేయి తీసుకుంటున్నారు. ఇది బాగానే ఉన్నా.. ఇక్కడి ఇసుకను పక్క మండలాలకు అక్రమంగా తరలిస్తున్నారు. ఇతరులకు ట్రాక్టర్ ట్రిప్పు రూ.5 వేలు దండుకుంటున్నారు. ఇసుకకు కృత్రిమ కొరత సృష్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మోతె వాగుకు ఆనుకొని ఉన్న రైతులు అనేక సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలేదు. రేయింబవళ్లు అక్రమ రవాణా సాగుతూనే ఉంది.

నా దృష్టికి రాలేదు– రాజేశ్వరి, తహసీల్దార్

మోతె వాగు నుంచి ఇతర మండలాలకు ఇసుక అక్రమ రవాణా నా దృష్టికి రాలేదు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఇసుక ఉచితంగా అందజేసేందుకు పంచాయతీ కార్యదర్శులకు టోకెన్లు జారీ చేశారు. స్థానికంగా రీచ్ లేనందున లబ్ధిదారుల ఇళ్ల వద్దకు ఇసుక రవాణాకు ఛార్జీలపై నిర్దిష్ట ఆదేశాలు రాలేదు.

# బాల్యం.. వ్యాయామ విద్యకు దూరం

సిరిసిల్ల : నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కావటంతో విద్యార్థులు ఉత్సాహంగా బడిబాట పట్టారు. సెలవుల్లో ఎక్కువ శాతం ఇళ్లలో గడపటంతో స్నేహితులతో ఆటలాడటానికి, చదువుకోవటానికి పాఠశాలలకు వెళ్తున్నారు. అయితే జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు వ్యాయామ విద్యకు దూరంగా ఉంటున్నారు. క్రీడల్లో వారికి మార్గదర్శనం చేసేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. జిల్లాలోని ఒక్క ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో కూడా వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

**వసతులు కూడా అంతంతమాత్రమే**

జిల్లాలో 109 జడ్పీహెచ్ఎస్, 1 యూఆర్ఎస్, 13 కేజీబీవీ, 2 జీహెచ్ఎస్, 336 ఎంపీపీఎస్, 38 ఎంపీయూపీఎస్‌లు ఉన్నాయి. మొత్తం 51 పీడీలు, 4 పీఈటీలు ఉన్నారు. వీరంతా ఉన్నత పాఠశాలల విద్యార్థులకే వ్యాయామ విద్య బోధిస్తున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలని నిబంధనలు ఉన్నప్పటికీ జిల్లాలోని 38 ఎంపీయూపీఎస్‌లో ఒక్కరు లేరు. ప్రాథమిక పాఠశాలల్లోనూ పీఈటీలను నియమించాలని ప్రతిపాదనలు ఉన్న ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. పలు ఉన్నత పాఠశాలల్లో క్రీడలకు



సరైన వసతులు లేవు. క్రీడా మైదానం ఇరుకుగా ఉండటం, ఆట వస్తువులు లేకపోవడం లాంటి సమస్యలు ఉన్నాయి.

సిరిసిల్ల అంబేద్కర్‌నగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ విద్య ఉపాధ్యాయురాలు ఉన్నప్పటికీ వసతులు సరిగ్గా లేవు. క్రీడామైదానం ఇరుగ్గా ఉంది.

రగుడు మండల ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 7వ తరగతి వరకు 60 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ పుస్తకాలతో కుస్తీ పట్టటం తప్ప వ్యాయామ విద్యకు నోచుకోవడం లేదు. జిల్లాలోని 38 ప్రాథమికోన్నత పాఠశాలల్లోని విద్యార్థుల పరిస్థితి అంతే ఉంది.

**ఆటలతో మెదడు చురుకు**

విద్యార్థులు నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతూ మార్కులు, ర్యాంకులు అంటూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే మెదడు చురుగ్గా ఉంటుంది. దీనికి ఆటలు దోహదపడతాయి. ఈ విషయంపై ప్రభుత్వం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిత్యం చదువుల పేరుతో ఒత్తిడి చేస్తున్నారే తప్ప క్రీడల వైపు వారిని ప్రోత్సహించటం లేదు. ఈ విషయంపై అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడాలి. చైనా, పాశ్చాత్య తదితర ప్రపంచ దేశాలు ప్రాథమిక స్థాయిలోనే పిల్లలోని ప్రతిభను గుర్తించి ఆటల్లో సాన పెడుతున్నాయి. దీంతో అవి ఒలంపిక్స్ వంటి ప్రపంచ స్థాయి పోటీల్లో పతకాలు కొల్లగొడుతున్నాయి. పిల్లలు ఆడుకోవటం వారి ప్రాథమిక హక్కుగా యునెస్కో గతంలోనే తీర్మానించింది. ఇటీవల ప్రఖ్యాత వైద్య జర్నల్ లాన్సెట్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం దేశ వ్యాప్తంగా అయిదేళ్ల నుంచి 19 ఏళ్ల వయస్సు వారిలో 1.25 కోట్ల మంది ఊబకాయులు ఉన్నారు. ర్యాంకులు, మార్కులు చుట్టూనే తిరుగుతున్న అశాస్త్రీయ విద్యావ్యవస్థ చిన్నారుల్లో స్థూలకాయ సమస్య పెరుగుదలకు ప్రధాన కారణమవుతోంది.

# నైపుణ్య శిక్షణకు నాంది

దుద్యాల: నైపుణ్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ఇందులో భాగంగా యువతకు వివిధ రకాల నైపుణ్య కోర్సులు అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలని నిర్ణయించింది. ఐటీఐల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్న ప్రభుత్వం తాజాగా నియోజకవర్గానికి ఒక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దుద్యాల మండలం హకీంపేటకు ఏటీసీని మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. సర్వే నెంబరు 252లో నాలుగెకరాల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేయనున్నారు.

**టాటా టెక్నాలజీస్ సంస్థ సహకారంతో..**

టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ సంస్థ సహకారంతో విద్యార్థులకు వివిధ రకాల నైపుణ్య కోర్సులను అందించనున్నారు. ఈ కోర్సులను చదివితే యువతకు పరిశ్రమల్లో ఉపాధి లభించే అవకాశాలుంటాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దుద్యాల మండలంలో పారిశ్రామికవాడను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో వివిధ రకాల పరిశ్రమలు




ఏర్పాటయ్యే అవకాశముంది. ఏటీసీతో ఇక్కడ ఏర్పాటయ్యే పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఆరు కోర్సులు.. 244 సీట్లు..**

ఏటీసీలో ఆరు కోర్సులు ప్రవేశపెడుతున్నారు. మొత్తం 244 సీట్లు అందుబాటులో ఉంటాయి. అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషిన్ టెక్నీషియన్ కోర్సు. దీని కాలవ్యవధి రెండేళ్లు. 48 సీట్లు ఉంటాయి. ఏడాది వ్యవధి ఉన్న ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్ కోర్సులో 20 సీట్లు అందుబాటులో ఉంటాయి. బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానికల్) కోర్సు కాల పరిమితి రెండేళ్లు. సీట్లు 48 ఉంటాయి. ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యాన్యుఫాక్చరింగ్ కోర్సు కాలపరిమితి ఏడాది. ఇందులో 40 సీట్లు ఉంటాయి. మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ కోర్సులో 48 సీట్లు ఉంటాయి. దీని వ్యవధి రెండేళ్లు. మ్యాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ కోర్సు కాలపరిమితి ఏడాది. ఇందులో 40 సీట్లు ఉంటాయి.

# చేతులు కలిసేనా!

కరీంనగర్ : కాంగ్రెస్ పార్టీ జిల్లా సమన్వయ సమావేశాలను కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో నిర్వహించనున్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా జిల్లా, మండల స్థాయి అధ్యక్షుల నియామకం, పార్టీ పదవుల విషయమై చర్చించి దిశా నిర్దేశం చేయడంతో పాటు అర్హుల జాబితా రూపొందించనున్నారు. సమావేశానికి ఉమ్మడి జిల్లా పార్టీ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌తో పాటు రాజేందర్‌రెడ్డి తదితరులు హాజరు కానున్నారు.

కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల పార్టీ సమావేశాలు బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరగనున్నాయి. పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు సంబంధించి తర్వాత నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. పెద్దపల్లిలో ఇన్‌ఛార్జి మంత్రి పర్యటన నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మొదటి నుంచి కాంగ్రెస్‌కు ఆయువుపట్టుగా ఉన్న కరీంనగర్‌లో నాయకుల మధ్య సమన్వయం కొరవడిందని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి పురుమల్ల శ్రీనివాస్‌పై చర్యలు తీసుకున్న తర్వాత ఇప్పటివరకు కొత్త ఇన్‌ఛార్జిని నియమించలేదు. దీంతో ముగ్గురు నేతలు ఎవరి దారి వారిదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసిన నరేందర్‌రెడ్డి, కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజేందర్‌రావు, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఎడమొహం పెడమొహంగా ఉంటున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సమావేశానికి ఎవరికి వారే వెళ్లడం పార్టీలో చర్చనీయాంశమైంది. జరిగే సమావేశంలో నేతల మధ్య సమన్వయం కుదర్చాల్సి ఉంది. ఈ విషయంలో పార్టీ నేతలు స్పందించాలని కార్యకర్తలు కోరుతున్నారు.

**కొందరికే ఆహ్వానం**

సమావేశాలకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పీసీసీ కార్యదర్శి, కార్పొరేషన్ల ఛైర్మన్లు, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్లు, సుడా ఛైర్మన్, ఇతర ముఖ్యులను మాత్రమే ఆహ్వానించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఉదయం కరీంనగర్ జిల్లా, మధ్యాహ్నం రాజన్న సిరిసిల్ల జిల్లా సమావేశాలు జరుగుతాయని పార్టీ ముఖ్యుడు ఒకరు తెలిపారు.

# భూసారానికి దన్ను

కోనరావుపేట : రాజన్న సిరిసిల్ల జిల్లా మెట్ట ప్రాంతం. ప్రజలు ఎక్కువగా వ్యవసాయాధారితంగా జీవనం సాగిస్తుంటారు. సాగులో భాగంగా అధిక మోతాదులో ఎరువులు వాడటంతో భూసారం తగ్గి దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో పచ్చిరొట్ట పెంపకం, పశువులు, కోళ్ల పేడ, సేంద్రియ ఎరువుల వినియోగంపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తుండటం సత్ఫలితాన్నిస్తోంది.

**పది వేలకుపైగా ఎకరాల్లో పచ్చిరొట్ట**

జిల్లాలో ఈ వానాకాలంలో 1.70 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది పచ్చిరొట్ట కోసం అధికారులు 4,800 క్వింటాళ్లకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా సుమారు 1200 క్వింటాళ్ల మేర సరఫరా అయింది. వీటిని 13 మండలాలకు పంపిణీ చేశారు. మహిళా సంఘాల సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంపిణీ చేశారు. జిల్లాలో సుమారు 10 వేలకుపైగా ఎకరాల విస్తీర్ణంలో పచ్చిరొట్ట సాగు చేశారు. 30 కిలోల బస్తాలను ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందజేసింది. రైతులు వరి నాట్లకు ముందు పచ్చిరొట్ట పైర్లను యంత్రాలతో కలియదున్నారు. దీంతో భూసారం పెరిగి వరి ఏపుగా, ఆరోగ్యంగా పెరగడానికి దోహదపడనుంది.

**పెట్టుబడి ఆదా.. దిగుబడి పెంపు**పుల్కం మల్లేశం, రైతు, మరిమడ్ల



నాకున్న నాలుగు ఎకరాలతోపాటు మరోరెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నా. ఏటా నాలుగు ఎకరాల్లో క్రమం తప్పకుండా పచ్చిరొట్ట విత్తనాలు వేస్తున్నా. దీంతో భూమి గుల్లగా మారి పోషకాలు పెరుగుతున్నాయి. పెట్టుబడి తగ్గుతోంది.

**విత్తన ఉత్పత్తికి ఆస్కారం**

సందీప్, ఏవో, కోనరావుపేట

పచ్చిరొట్ట ఎరువుతో భూసారం పెరిగి మొక్కల ఎదుగుదలకు పోషకాలు అధికంగా లభిస్తాయి. పంటకు దోహదం చేసే మిత్ర పురుగులు వృద్ధి చెందుతాయి. రైతులు పంటల సాగులో పశువుల పేడ, పచ్చిరొట్ట ఎరువులపై దృష్టి సారించేలా వ్యవసాయ శాఖ ప్రోత్సహిస్తోంది. రైతులు ఏటా పచ్చిరొట్టను సాగు చేసుకొని విత్తన ఉత్పత్తి చేసుకోవాలి. పంట కాలం 60-70 రోజులు, ఎకరాకు 10-12 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. క్వింటాకు రూ.8 వేల ధర పలకగా సాగుకు ఎలాంటి ఖర్చు లేకుండా రూ.90 వేల ఆదాయం పొందొచ్చు. దీంతో గ్రామంతోపాటు ఇతర గ్రామాల రైతులకు సకాలంలో పచ్చిరొట్ట ఎరువులు రైతులే సరఫరా చేయటానికి ఆస్కారం ఉంటుంది.

# జీతాలు అందక.. జీవితాలు సాగక..



సంగారెడ్డి : ఉపాధి హామీ పథకంలో పనులు నిర్వహిస్తున్న సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేసే పథకాల కింద విడుదలయ్యే నిధులను పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త వ్యవస్థను తీసుకొచ్చింది. ఉమ్మడి పథకాల సీఎస్ఎన్(సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్స్) నిధుల వినియోగంలో పారదర్శకత, సమర్థత, బాధ్యతను పెంచేందుకు 'స్పర్శ' అనే నూతన డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. అయితే యాప్‌లో సిబ్బంది వివరాల నమోదులో జాప్యం జరగడంతో, వేతనాల చెల్లింపుపై ప్రభావం చూపుతోంది. సాంకేతిక సమస్యలను అధికారులు పరిష్కరించకపోవడంతో సిబ్బందికి అవస్థలు తప్పడంలేదు.

**సమస్యలతో సతమతం:** ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఉపాధి పనులు నిర్వహించే క్షేత్ర, సాంకేతిక సహాయకులకు మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఏపీవో, పీవోలకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వడంలేదు. ఉన్నతాధికారులకు విన్నవిస్తే, రాష్ట్రస్థాయి సమస్య అని తేలికగా తీసిపారేయడంతో, ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కొన్ని జిల్లాలో వేతనాలు అడిగిన సిబ్బందికి తాఖీదులు జారీ చేయడంతో, ఉమ్మడి జిల్లాలో అప్పులు తెచ్చుకుని కుటుంబాలను పోషించుకుంటున్నా, అడగడంలేదు.

**ఉన్నతాధికారులు చొరవ తీసుకుంటేనే..**

గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు చొరవ తీసుకుని యాప్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తేనే సిబ్బందికి వేతనాలు అందే అవకాశం ఉంది. ఏడాదిగా జీతాల పంపిణీలో ఇలానే జాప్యం జరుగుతోందని సిబ్బంది వెల్లడిస్తున్నారు. ఈ విషయంలో కలెక్టర్లు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

**హెచ్‌ఆర్ సౌకర్యం కల్పించాలి..-** వెంకటయ్య, కుదురుమళ్ల

ఉపాధిహామీ పథకంలో 2006 నుంచి క్షేత్ర సహాయకుడిగా పనిచేస్తున్నా. చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఉద్యోగ భద్రత లేదు. మూణ్నెల్లుగా వేతనాలందక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఉద్యోగ భద్రతతోపాటు హెచ్‌ఆర్ సౌకర్యం కల్పించాలి.

**కుటుంబ నిర్వహణ కష్టంగా మారింది..-** రాందాసు, క్షేత్రసహాయకుడు

మాది పరిగి మండలం బసిరెడ్డిపల్లి. వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నాం. కొద్దిపాటి పొలం ఉండటంతో కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నా. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో ఇతరుల వద్ద ప్రతినెలా అప్పులు చేయాల్సి వస్తోంది. పెట్టుబడులకూ అవస్థలు తప్పడం లేదు.

# చేయూత ఇంతింతై..



వికారాబాద్ : మహిళలను కోటీశ్వరులుగా మారుస్తామన్న ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు మరింత ముమ్మరం చేసింది. ఇప్పటికే అనేక చోట్ల ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్లు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ, పెట్రోల్ బంకుల కేటాయింపు, సోలార్ యూనిట్లు, రుణబీమా, ప్రమాదబీమా వంటి పథకాలను అమలు చేస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా వడ్డీ లేని రుణాలనూ అందించి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చర్యలు చేపట్టింది. దీంతో పొదుపు సంఘాల సభ్యుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

**పనితీరే ప్రామాణికం..**

రుణాలు తీసుకోవడం, వాటిని సద్వినియోగం చేసుకోవడంతోపాటు సకాలంలో తిరిగి చెల్లించడం వంటి వాటిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోంది. ఇలా జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో 1,102 సంఘాలు వడ్డీలేని రుణాన్ని పొందడానికి అర్హత సాధించాయి. 2023 డిసెంబరు నుంచి ఈ ఏడాది మార్చి 25 వరకు ఎంపిక చేసిన సంఘాలకు ప్రయోజనం కలగనుంది. మొత్తంగా రూ.32.71 కోట్లు త్వరలోనే జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా అందనున్నాయి.

**ప్రభుత్వ నిర్ణయంతో ఊరట..**

మండల సమాఖ్య నుంచి గ్రామ సంఘాలు.. వాటి ద్వారా సభ్యులు రుణాలు తీసుకోవడం పరిపాటు. ఒక్కోచోట రూపాయి, మరోచోట రూ.రెండు చొప్పున గ్రామ పరిధిలో సంఘాల సభ్యుల ఆమోదంతో వడ్డీ వసూలు చేస్తున్నాయి. ఇది సంఘాల బలోపేతానికి మంచి నిర్ణయమే అయినా వడ్డీ భారంతో కొందరు నిరుపేదలు చెల్లింపుల వేళ అవస్థలు పడుతున్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవడంతో కొండంత భారం తగ్గినట్లయింది.

**పెరగనున్న పోటీతత్వం..**

సంఘాల బలోపేతానికి తీసుకుంటున్న చర్యలు, ఇస్తున్న ప్రోత్సాహంతో వాటి మధ్య పోటీతత్వం మరింత పెరిగేందుకు అవకాశం ఏర్పడింది. జిల్లాలో ఎ గ్రేడ్‌లో ఉన్న సంఘాలు 9998, బి గ్రేడ్‌లో 877, సి గ్రేడ్‌లో 1426, డి గ్రేడ్‌లో 1349 వరకున్నాయి. వీటిని గాడిన పెట్టేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో కార్యాచరణ రూపొందిస్తున్నారు.

**ఆర్థికంగా నిలదొక్కుకోవాలి..- శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి.** ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సంఘాలు చక్కగా సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహిస్తున్నాం. తద్వారా ఆర్థికంగా నిలదొక్కుకొని వ్యాపారంలో రాణించేలా ప్రయత్నించాలి. కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

# బస్సుల కొరత.. గమ్యం చేరేదెలా?



జగిత్యాల : జగిత్యాల ఆర్టీసీ డిపో పరిధిలో బస్సుల సంఖ్య తక్కువగా ఉండటంతో పాటు కండక్టర్ల కొరతతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. డిపో పరిధిలో 65 ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు అద్దె బస్సులు 53 కలిపి మొత్తం 118 బస్సులు ఉన్నాయి. వీటిలో 16 లగ్జరీ, 4 రాజధాని బస్సులు దూర ప్రాంతాలకు నడుస్తున్నాయి. ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులు 26, ప్రైవేటువి 23 గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు, విద్యార్థులను వారి గమ్య స్థానాలకు చేరుస్తున్నాయి. మిగతావి ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉంటాయి. మహాలక్ష్మి పథకం కారణంగా డిపో ఆదాయం పెరిగినప్పటికీ.. ఆశించిన లక్ష్యంలో 90 శాతం ఆదాయం మాత్రమే సమకూరుతోంది.

**20 శాతం మేర ఆదాయం లోటు**

బదిలీల కారణంగా డిపో పరిధిలో కండక్టర్ల కొరత ఏర్పడింది. ప్రస్తుతం 23 మంది కండక్టర్ల అవసరం ఉంది. ఖాళీలను ఎప్పుడు భర్తీ చేస్తారనే విషయంలో స్పష్టత లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. రోజుకు 115 షెడ్యూళ్లతో 48వేల కి.మీ వరకు నడుస్తున్న బస్సులు.. 40 వేలకు పైగా ప్రయాణికులను గమ్యం చేరుస్తున్నాయి. రోజుకు మహాలక్ష్మి పథకం ద్వారా రూ.15 లక్షల ఆదాయం సమకూరుతుండగా.. ఇతర ప్రయాణికుల ద్వారా రూ.15 లక్షల ఆదాయం రావాలి. కానీ 20 శాతం మేర తగ్గిపోయి రూ.12 లక్షలు మాత్రమే వస్తోంది. దీనికి తోడు 19 మంది ఏడీసీలకు(క్లర్కులు) 14 మంది మాత్రమే ఉండటంతో, డిపో నిర్వహణ కష్టంగా మారగా, సిబ్బందిపై అదనపు భారం పడుతోంది.

**ప్రయాణికుల వినతులు..**

స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రయాణికుల నుంచి వినతులు, ఫిర్యాదులు వస్తున్నా కండక్టర్ల కొరతతో ఆయా రూట్లలో షెడ్యూళ్లు సర్దుబాటు చేయడానికి డిపో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. మద్దునూర్‌తో పాటు, మరికొన్ని దారుల్లో విద్యార్థులు సకాలంలో బస్సులు రావడం లేదని ఫిర్యాదులు చేస్తున్నారు. రామడుగు ప్రాంతంలోని ఆదర్శ పాఠశాలకు షెడ్యూళ్లను జగిత్యాల డిపో పరిధికి బదిలీ చేయడంతో భారంగా మారింది. దీనికి తోడు యాదాద్రి, శ్రీశైలం తదితర పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపాలని భక్తులను నుంచి వినతులు వస్తున్నాయి. బస్సులు, సిబ్బంది కొరతతో సర్దుబాటు చేసేందుకు అవకాశం లేకుండా పోయింది.

**ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు**

ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులకు అనుగుణంగా ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. డిపో పరిధిలోని పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదించాం. అదనపు బస్సుల మంజూరు, కండక్టర్ల కొరత అంశం అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నాం.కల్పన, జగిత్యాల డిపో మేనేజర్

# కట్టెల పొయ్యి కష్టాలు తీరుతున్నాయా?

కరీంనగర్ : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైన నాటి నుంచి కట్టెల పొయ్యి మీదనే వంట చేస్తున్నారు. ఇప్పటి వరకు చాలా పాఠశాలల్లో గ్యాస్ కనెక్షన్లు లేవు. దీంతో మధ్యాహ్న భోజన కార్మికులకు పొగతో వంట చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో పొయ్యిలపై వండటం, కట్టెలను నిల్వ చేయడం సమస్యగా మారేది. గతంలో పాఠశాలలకు గ్యాస్‌లు అందించినా మూలకుపడ్డాయి. ఈసారి ఆ పరిస్థితిని అధిగమించేందుకు అన్ని పాఠశాలల్లో గ్యాస్‌ను ఉపయోగించేలా చూడాలని కలెక్టర్లు, డీఈవోలకు రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆగస్టు 15 నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఉన్నతాధికారులు సూచించారు.



**పాతవి ఉన్నట్టా.. లేనట్టా?**

కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో మొత్తం 2364 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 1216 పాఠశాలల్లో వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. కొత్తగా 1148 పాఠశాలలకు కనెక్షన్లు ఇప్పించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఉమ్మడి జిల్లాలో 1216 పాఠశాలల్లో గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే 2003లో రూ.350 చెల్లిస్తే ఒక సిలిండర్, స్టవ్‌ను అందించారు. అనంతరం వాటి గురించి పట్టించుకునే వారు లేకపోవడంతో పాఠశాలల్లో అవి ఎక్కడున్నాయో కూడా ఎవరికీ తెలియదు. వాటి వాడకం లేని కారణంగా మెజారిటీ బడుల్లో అవి లేవు. దీనిపై జిల్లా విద్యాశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి కనెక్షన్లు లేని బడులన్నింటికి అందించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

# కాలం మారిందా.. అన్నట్లు.. ఇక్కట్లు..!

మిర్యాలగూడ : జిల్లాలో విచిత్రకరమైన వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభమైనా వానలు కురవక పోగా.. గత నాలుగు రోజులుగా మధ్యాహ్నం ఎండలు మండిపోతున్నాయి. మరో వైపు సాయంత్రం మబ్బులు పడుతూ.. తెల్లవారుజామున కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గిపోతున్నాయి.

జిల్లా వ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతూ.. వేసవిని తలపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సైతం సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం అలంగాపురంలో రాష్ట్రంలోనే రెండో అత్యధిక ఉష్ణోగ్రత(38.2 డిగ్రీల సెల్సియస్) నమోదు అయింది.

గతేడాదితో పోలిస్తే నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో భూగర్భ జలాల లభ్యత కొంత మెరుగ్గానే ఉన్నప్పటికీ.. యాదాద్రిలో పరిస్థితి తీవ్రంగా ఉంది. యాదాద్రి జిల్లాలో గతేడాది జూన్‌లో భూగర్భ జలాల లభ్యత 10.41 మీటర్లు ఉండగా.. ఈ ఏడాది జూన్‌లో 12.22 మీటర్లుగా నమోదైంది. జూన్ 1 నుంచి జులై 15 వరకు అత్యధికంగా సూర్యాపేట జిల్లాలో 47 శాతం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కాగా.. నల్గొండలో 37శాతం, యాదాద్రిలో 36 శాతం తక్కువగా నమోదైంది. సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో అత్యధికంగా 81 శాతం, పాలకవీడులో 72శాతం, నేరేడుచర్లలో 67శాతం, హుజూర్‌నగర్‌లో 66 శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది.



తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంటల సాగుపై ప్రభావం పడుతుంది. ఇప్పటికే రైతులు నార్లు పోసి.. వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. చాలా మంది నార్లు ఎండి పోతుండగా.. కొన్ని వాడు ముఖం పట్టాయి. బోర్ల కింద వేసినవి మాత్రమే నాటుకు సిద్ధంగా ఉన్నాయి.

**నార్లు ఎండుతున్నాయి**

శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

జిల్లాలో వర్షాభావ పరిస్థితులతో ముందుగా పోసిన నార్లు నీరు లేక ఎండిపోతున్నాయి. వాడుతున్న నార్లను కాపాడుకోవాలంటే 191919 మందును ఒక లీటర్ నీటికి 10 గ్రాములు కలిపి పిచికారీ చేస్తే కొంత సమస్య తీరొచ్చు.

# ఇలా పట్టుకుంటాం..

ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లా అనగానే ఆబ్కారీ శాఖకు గుర్తొచ్చేది గంజాయి.. విశాఖ ఏజెన్సీ, ఛత్తీస్‌గఢ్ కొండ ప్రాంతాల్లో పండే గంజాయిని హైదరాబాద్ లాంటి నగరాలకు, మహారాష్ట్రకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల మీదుగానే యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో నిత్యం ఏదోచోట నిందితులు పట్టుబడుతున్నారు. బాధాకరమైన విషయం ఏమిటంటే చౌకైన మత్తు పదార్థం సమీపంలోనే దొరుకుతుండటంతో ఉభయ జిల్లాల్లో కొంతమంది విద్యార్థులకు దీనికి బానిసలుగా మారుతున్నారు. రహస్యంగా మధ్యవర్తుల సహకారంతో కొద్ది మొత్తాల్లో తెచ్చుకుని జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఆధునిక పరీక్ష యంత్రం సహకారంతో గంజాయి సేవిసున్న వారిని సులువుగా పట్టుకునేలా ఆబ్కారీ శాఖ మార్పులకు శ్రీకారం చుడుతోంది.

**సరకు పట్టివేతతో నియంత్రణ సాధ్యమా?**

ఉభయ జిల్లాల్లో ఆబ్కారీ శాఖ విస్తృత తనిఖీలు, పోలీసు శాఖ సహకారం, టాస్క్‌ఫోర్సు బృందాల గస్తీతో గంజాయి ముఠాలను పట్టుకుంటున్నారు. చిన్న మొత్తాల్లో బైక్‌లపై తీసుకొస్తూ ఉమ్మడి జిల్లాలో యువతా దొరుకుతున్నారు. అయినా గంజాయి మత్తులో ఘర్షణలకు దిగుతూ, దాడులు చేసుకుంటూ పోలీసు కేసుల దాకా తెచ్చుకుని జీవితాల్ని నాశనం చేసుకుంటున్న ఉదంతాలకు అడ్డుకట్ట పడటం లేదు. కారణం? ఆబ్కారీ వారు తనిఖీల్లో సరకునైతే పట్టుకోగలుగుతున్నారే కానీ ఎవరు పీలుస్తున్నారు? ఎక్కడ సేవిస్తున్నారు? అని రక్కున నిర్ధారించలేకపోతున్నారు. డ్రంకన్ డ్రైవ్ తరహాలో సామాజిక ప్రదేశాల్లో బహిరంగంగా పరీక్షించలేకపోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా 'గంజాయి టెస్టింగ్ కిట్ల'ను ఎక్సైజ్ అధికారులు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ఉభయ జిల్లాలకు ఇవి రానున్నాయి. ఇప్పటికే వీటి వినియోగం, పరీక్ష తీరుపై శిక్షణ కూడా పూర్తయింది. ప్రస్తుతం కిట్లను తెలంగాణ నార్కొటిక్ విభాగం మాత్రమే ఉపయోగిస్తోంది. **ఇదీ వినియోగం.. ఇలా ఉపయోగం..**

గంజాయి టెస్టింగ్ కిట్లలో మిషినరీతోపాటు చిన్న బాక్సులో స్ట్రిప్‌లు ఉంటాయి. ఒక్కో బాక్సులో 114 మంది పుల్లలు ఉంటాయి. వీటిపై అనుమానితుల నుంచి సేకరించిన మూత్రాన్ని వేస్తే రంగు మారుతుంది. దాని ఆధారంగా అతను గంజాయి తాగాడా లేదా అని తెలుస్తుంది. స్ట్రిప్ ఫలితంపై సందేహం ఉంటే రక్త, మూత్ర నమూనాలు సేకరించి మిషనరీలో పరీక్షిస్తారు. నిమిషాల వ్యవధిలో ఫలితం వస్తుంది.

# బిల్లులు రాలేదు.. కష్టాలు తీరలేదు

కరీంనగర్ : మండల కేంద్రం దోమకు చెందిన రైతు కొమ్ముగల్ల బుగ్గయ్యకు పశువుల పాక మంజూరైంది. నిర్మాణం పూర్తయి ఆర్నెల్లు కావొస్తున్నా బిల్లులు మాత్రం అందలేదు. అప్పులిచ్చిన వారు అడుగుతున్నారని ఆయన వాపోతున్నాడు. దోమ మండలంలోని ఐనాపూర్‌లో ఇద్దరు అన్నదాతలు పనులు పూర్తి చేశారు. సాంకేతిక నిపుణులు కొలతలు తీసి బిల్లులకు ప్రభుత్వానికి పంపారు. డబ్బులు ఎప్పుడు వస్తాయోనని ఎదురుచూస్తున్నారు.
మండల పరిధి కిష్టాపూర్‌లో మూడు పాకలు నిర్మించుకోడానికి అనుమతి ఉన్నా.. రైతులు ముందుకు రావడం లేదు. బిల్లుల వస్తాయో.. లేదోనని భయపడుతున్నారు.
పాడి రంగానికి ప్రాధాన్యమిచ్చి రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధిహామీ పథకంలో భాగంగా పశువుల పాకల నిర్మాణానికి అవకాశం కల్పించాయి. ఈ పథకం అన్నదాతలకు ఎంతో ఉపయోగపడుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా.. పాకల నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా ఇంకా బిల్లులు మాత్రం అందడం లేదు. దీంతో లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

**జిల్లాలో 680 మంది అర్హులు..**

జిల్లాలో పశువులు పెంచుతూ పాడి రంగంపై ఆధారపడి చాలామంది రైతులు జీవనోపాధి పొందుతున్నారు. ఉపాధిహామీ పథకంలో పశు



వుల పాకల నిర్మాణానికి చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. అధికారులు పథకం అమలు చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను జిల్లాలో 561 పంచాయతీల్లో 680 మందిని ఉపాధిహామీ సిబ్బంది అర్హులుగా గుర్తించారు. వారిలో 344 మంది అన్నదాతలకు పాకల నిర్మాణానికి అనుమతి లభించింది. నిధులు రూ. 3.10 కోట్లు మంజూరు కాగా.. 150 మంది పనులు ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 62 మంది గొర్రెలు, మేకలు, పాడి పశువుల పాకలు నిర్మించుకొని బిల్లులకు ఎదురుచూస్తున్నారు. డబ్బులు రావడం లేదంటూ మరికొందరు నిర్మాణాలు ప్రారంభించ లేదు.

**ప్రభుత్వానికి పంపించాం..-నర్సిములు, ఏపీవో, దోమ**

పాకల నిర్మాణాలు పూర్తయిన వాటి కొలతలు తీసి బిల్లులు చెల్లించాలని ప్రభుత్వానికి పంపాం. ఇంకా బిల్లులు రాలేదు. విడుదల చేస్తే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి.

# చారిత్రక కోటకు నిర్లక్ష్యపు బీటలు

జగిత్యాల : రెండున్నర దశాబ్దాల చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన జగిత్యాల ఖిలా నాటి ప్రాభవాన్ని కోల్పోతోంది. శత్రు సేనలను నిలువరించిన మహాద్వారాలు, ఆయుధ సంపద ఏనాడో చోరుల పాలయ్యాయి. నిజాం సేనల పోరుకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన కోట గోడలు సంరక్షణ కరవై బీటలు వారుతున్నాయి.
జగిత్యాలలో క్రీ.శ.1747లో ఎల్గందల కోటకు అధిపతిగా ఉన్న మీర్జా ఇబ్రహీంఖాన్ థింసా ఫ్రెంచి ఇంజినీర్ల సహకారంతో నక్షత్రాకారంలో ఖిలాను నిర్మించారు. శత్రువులు దాడి చేయకుండా కోట చుట్టూ నిర్మించిన బురుజుల్లో 6 అడుగుల లోతు కందకాలు తవ్వారు. వాటిలో మొసళ్లు ఉండేవని చరిత్ర చెబుతోంది. మందుగుండు సామగ్రి నిలువ చేయడానికి పెద్ద గదులుండేవి. 1791లో కోట రక్షణకు ఒక ఖిలేదార్, 210 మంది సిపాయిలుండేవారు. 1930 వరకు జగిత్యాల రెవెన్యూ కార్యాలయాల సేవలు ఖిలాలోనే నిర్వహించారు. కాలక్రమేణా ఖిలా సంపదతో పాటు చారిత్రక ఆనవాళ్లు కనుమరుగవుతున్నాయి.

**ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావంతో..**

2014లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఖిలాకు పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా అక్కడే నిర్వహించారు. 2016లో జగిత్యాల జిల్లాకేంద్రంగా మారిన తర్వాత రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంతో పాటు స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలకు ఖిలా వేదికగా నిలిచింది. ఈ క్రమంలో సందర్శకుల సంఖ్య క్రమంగా పెరిగింది. పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఖిలా వద్ద భద్రతా చర్యలు చేపట్టారు. రెండేళ్ల కిందట జిల్లా సమీకృత పాలనా ప్రాంగణం(కలెక్టరేట్) పూర్తి కావడంతో వేడుకలను కలెక్టరేట్, పరేడ్ మైదానాలకు మార్చారు. ఈ నేపథ్యంలో ఖిలా అభివృద్ధి మళ్లీ కుంటుపడింది. పురావస్తు శాఖ



కాపలాదారును తొలగించడంతో తిరిగి అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా మారింది.

**ఆక్రమణలు.. సామగ్రి చోరీ**

పట్టణ జనాభా పెరగడంతో ఖిలా ప్రాంతం చుట్టూ జనావాసాలు పెరిగాయి. ఖిలా గోడలను ఆనుకొని ఉన్న ఖాళీ స్థలాలను పలువురు ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. కోట లోపల ఉన్న కర్ర తలుపులు, ఇనుప సామగ్రి, ఫిరంగులు తదితర సంపదను కొల్లగొట్టారు. ఖిలా లోపల అసాంఘిక కార్యకలాపాలు పెరిగాయి. దశాబ్దం కిందటి వరకు ఖిలాలో దుర్గంధం వ్యాపించేది. స్థానికంగా ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో సందర్శకులు వెళ్లేందుకు భయపడే పరిస్థితి నెలకొంది.

**వ్యర్థాలతో దుర్గంధం**

ఖిలా వెలుపల, లోపల పూర్తిగా ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి. అయిదేళ్ల కిందట ప్రభుత్వం నాటిన మొక్కలు ఎదిగి పచ్చదనం సంతరించుకున్నా నిర్వహణ కరవైంది. కోట చుట్టూ వ్యర్థాలు పేరుకుపోయి విపరీతమైన దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు పలుమార్లు బల్దియాకు ఫిర్యాదు చేశారు. ఖిలా ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్ పరికరాలను ఆకతాయిలు ధ్వంసం చేశారు. జగిత్యాలకు తలమానికమైన చారిత్రక సంపదకు పూర్వ వైభవం తేవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

# అనుమతులు కొన్ని.. అక్రమాలు లెక్కలేనన్ని



హైదరాబాద్ : రసాయన పరిశ్రమల్లో అనుమతుల్లేకుండా ఆర్అండ్‌డీ (రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్) యూనిట్లు ఏర్పాటు చేస్తున్న కొందరు సమ్మతి లేని ఉత్పత్తులు కూడా తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కల్తీకల్లు మరణాలు రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో అందులో వాడే ఆల్ప్రాజోలం తయారీ యూనిట్‌పై పీసీబీ ఇటీవల చర్యలు తీసుకుంది. కామారెడ్డి జిల్లా మద్నూర్ ఠాణాలో దాఖలైన కేసు ఆధారంగా నాచారంలోని టెంపుల్ ఆర్గానిక్స్ ఆర్అండ్‌డీ యూనిట్‌లో అల్ప్రాజోలం తయారు చేస్తున్నట్టు సమాచారం అందుకున్న పీసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. కన్సెంట్ ఫర్ ఆపరేషన్, కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్ అనుమతులు లేకుండానే బల్క్‌డ్రగ్, ఉత్పత్తుల సంశ్లేషణలో పరిశోధన చేస్తున్నట్టు గుర్తించి ఆ యూనిట్ మూసివేతకు ఉత్తర్వులు జారీ చేశారు.
ఉత్పత్తి సామర్థ్యం ఒక కేజీకి మించొద్దు.. పర్యావరణ అనుమతులు (ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్) లేకుండా అనేక పైలట్ ప్లాంట్లు నగరంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. బాహ్యవలయ రహదారి పరిధిలో ఫార్మా, బల్క్‌డ్రగ్, బల్క్‌డ్రగ్ మధ్యంతర ఉత్పత్తుల ఆర్అండ్‌డీ యూనిట్లను ఏర్పాటు చేయొద్దనే ఉత్తర్వులున్నాయి. పరిశోధనల్లో ఉత్పత్తి సామర్థ్యం రోజుకు ఒక కేజీకి మించొద్దనే నిబంధనలున్నాయి. ఇవేవీ పాటించకుండా వందల లీటర్ల సామర్థ్యం ఉన్న యంత్రాలతో ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. సాధారణంగా ఆర్అండ్‌డీ యూనిట్ నెలకొల్పడానికి 50 నుంచి 100 లీటర్ల ఫ్లాస్క్ సామర్థ్యం నిబంధనను పట్టించుకోకుండా 500 నుంచి 1,000 లీటర్ల సామర్థ్యంతో రియాక్టర్లు ఏర్పాటు చేసి ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. యూనిట్‌లో రూ.కోట్ల విలువైన ఉత్పత్తులు కొనసాగిస్తున్నారు. పర్యావరణ అనుమతులు లేకుండానే నాలుగైదు అంతస్తుల ఆర్అండ్‌డీ యూనిట్లు, కింద పైలట్ ప్లాంట్లు ఏర్పాటు చేసి వ్యాపారం సాగిస్తున్నారు. మల్లాపూర్, నాచారం, చర్లపల్లి, ప్రశాంత్‌నగర్, ప్రగతినగర్ రాజీవ్‌నగర్, గాంధీనగర్, జీడిమెట్ల, మేడ్చల్, హయత్‌నగర్‌లో ఈ తరహా పైలట్ ప్లాంట్లు ఎక్కువగా నడుస్తున్నాయి.

**జాబితా ఆధారంగా తనిఖీలు చేస్తే..**

పర్యావరణ అనుమతులు (ఈసీ) లేకపోతే పరిశ్రమ కోసం పెట్టిన పెట్టుబడిలో 30 శాతం వరకు జరిమానా విధించే ఆస్కారం ఉంది. మున్సిపల్, జీఎస్టీ, పరిశ్రమల శాఖ నుంచి అనుమతులు తీసుకున్న జాబితాను పరిశీలిస్తే ఎక్కడ, ఏయే పరిశ్రమలు ఏ ఉత్పత్తులు తయారు చేస్తున్నాయో తెలిసే అవకాశం ఉంటుంది. ఆ జాబితా ఆధారంగా తనిఖీలు చేస్తే అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉంటుంది.

# తెర వెనక రియల్టర్లు.. భారీ ప్రణాళికలు



హైదరాబాద్ : రాజధానికి సమీపంలోని మొయినాబాద్ మండలం ఎన్కేపల్లిలో గోశాల భూములను కొట్టేసేందుకు కొందరు రియలర్టు తెరవెనుక భారీ ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారని పోలీసులు, రెవెన్యూశాఖ అధికారులు ప్రాథమిక సమాచారం సేకరించారు. ఈ వ్యవహారం వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అని ఆరా తీస్తుండగా తెర వెనుక భారీ రియల్టర్లున్నారని ప్రాథమిక సమాచారం లభించిందని తెలిసింది. ఎన్కేపల్లికి చెందిన కొందరిని ప్రలోభపెట్టి వారి పేర్లమీద నకిలీ పత్రాలు సృష్టించి ఈ-పాస్‌పుస్తకాలను పొందాలన్న లక్ష్యంతో కార్యాచరణ రూపొందించినట్టు పోలీసులకు సమాచారం లభించింది.

**హెచ్ఎండీఏ ప్రాజెక్టు సాధ్యం కాకపోవడంతో..**

200 ఎకరాలను మూడు దశాబ్దాల క్రితం ప్రభుత్వం హుడాకు అప్పగించింది. ఇవి జీవో 111 పరిధిలో ఉండడంతో ఆ ప్రతిపాదన అక్కడితో ఆగిపోయింది. మూడేళ్ల క్రితం ప్రభుత్వ ఉన్నతాధికారులు 111జీవోను సమీక్షిస్తూ జీవో నంబరు 69ను జారీచేశారు. దీంతో జంట జలాశాయ పరిసర ప్రాంతాల్లోని ప్రైవేటు భూములు, పట్టా భూముల్లో వెంచర్లు నిర్మించుకోవచ్చని రియల్టర్లు భావించారు. ఖాళీగా ఉన్న ఎన్కేపల్లిలో హెచ్ఎండీఏ భూములు ఆక్రమించుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

**రెవెన్యూ అధికారులతో మంతనాలు.. బేరాలు**

ఎన్కేపల్లి భూములను కొంచెం కొంచెం ఆక్రమించుకుంటే ఎవరికీ అనుమానం రాదనుకున్నారు. ఇద్దరు రెవెన్యూ అధికారులతో రెండేళ్ల క్రితం ప్రాథమికంగా సంప్రదింపులు జరిపారు. సానుకూల స్పందన రావడంతో ప్రభుత్వ భూములను పట్టాభూములుగా మార్చేందుకు ప్రయత్నాలు చేశారు. సర్వేనంబర్ 180కి బై నంబర్లు వేసుకోవాలని, వాటిని పార్టులుగా విభజించి ఈ-పాస్‌పుస్తకాలు మంజూరు చేయించుకోవాలన్నది ప్రణాళిక. నకిలీ పత్రాలతో పట్టాలు సృష్టించినా ఈ-పాస్ పుస్తకాలు రాలేదు. ఈలోపు ఇద్దరు రెవెన్యూ అధికారులు బదిలీ కావడంతో ఆక్రమణలకు బ్రేక్ పడింది.

# అంతా సిద్ధం.. అయినా సతమతం




హైదరాబాద్ : అవన్నీ వందల కోట్ల విలువైన ప్లాట్లు.. ఇప్పటికే అక్కడ లేఅవుట్లు అభివృద్ధి చేసి కొన్ని విక్రయించారు. ఇంకా కొన్ని అలాగే మిగిలి ఉన్నాయి. కొన్ని లేఅవుట్లలో ఆక్రమణలు కూడా సాగుతున్నాయి. మేడిపల్లి లేఅవుట్‌లో పార్కు కేటాయించిన స్థలాన్ని కబ్జా చేస్తున్నారని తాజాగా అసోయేషన్ ప్రతినిధులు హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. ఇప్పటికే శంషాబాద్‌లోని ఉన్న హెచ్ఎండీఏ స్థలాన్ని తప్పుడు పత్రాలతో కబ్జా చేయడంతో కోర్టు జోక్యంతో తిరిగి హెచ్ఎండీఏ ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. కొన్నేళ్లుగా లేఅవుట్‌లో ఖాళీగా ఉన్న ప్లాట్లను విక్రయించడంలో హెచ్ఎండీఏ తాత్సారం చేస్తోంది. అదిగో ఇదిగో అంటూ కాలయాపన తప్పా...కార్యాచరణ కన్పించడం లేదు.
గతంతో పోల్చితే స్థిరాస్తి మార్కెట్ ఊపందుకుంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు లేఅవుట్ల, భవనాల నిర్మాణాల కోసం పెరిగిన అనుమతులే ఇందుకు నిదర్శనం. జూన్ నెలాఖరు నాటికి 922 అనుమతులు ద్వారా రూ. 519.84 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది.

**నాన్చుడు ఎందుకో..** హెచ్ఎండీఏ వ్యాప్తంగా అందుబాటులో ఉన్న లేఅవుట్లను ఇప్పటికే అధికారులు లెక్క తేల్చారు. ఎక్కడెక్కడ ఎన్ని ప్లాట్లు ఉన్నాయి.. మిగిలిన ప్లాట్లను గుర్తించి వేలం ద్వారా విక్రయించేందుకు రంగం సిద్ధం చేశారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఔటర్‌రింగ్ రోడ్డు, ప్రాంతీయ రింగ్‌రోడ్డు మధ్యలోనే ఎక్కువ లేఅవుట్లు ఉన్నాయి. ప్రస్తుతం నగరంతా అటే విస్తరిస్తోంది. హెచ్ఎండీఏ ప్లాట్లకు మంచి డిమాండ్ ఉంటుందని అధికారులు సైతం భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రైవేటు లేవుట్లలో ప్లాట్లు కొనాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. సదరు భూమి వెనుక వివాదాలు ఏమైనా ఉన్నాయా.. అనేది కీలకం. సరైన వివరాలు ఇచ్చేవారు కరవే. హెచ్ఎండీఏ, రేరా, డీటీసీపీ అనుమతులు లేకపోయినా.. ఏజెంట్లను పట్టుకొని అవగాహన లేనివారికి కొందరు అంటగడుతున్నారు. తీరా కొన్నాక అసలు విషయం తెలిసి లబోదిబోమంటున్నారు. అదే హెచ్ఎండీఏ సంస్థలోని ప్లాట్లకు అలాంటి ఇబ్బంది ఉండదు. దీంతో ఎక్కువ మంది ఇలాంటి లేఅవుట్లలో కొనేందుకు ఆసక్తి చూపుతుంటారు. రెండేళ్ల క్రితం పలు లేఅవుట్లలో వేలం వేసిన ప్లాట్లకు మంచి గిరాకీ వచ్చింది. చదరపు గజం సరాసరి రూ. 60 వేల నుంచి 70 వేల వరకు పలికింది. ప్రస్తుతం ఆయా లేఅవుట్లల్లో ఇంకా చాలా ప్లాట్లు మిగిలే ఉన్నాయి. ఇలానే ఖాళీగా విడిచి పెడితే ఆఖరికి కబ్జాల పాలుకానున్నాయి. వెంటనే వీటిపై నిర్ణయం తీసుకుంటే నిధులు సమకూరి వాటిని అభివృద్ధి పనులకు వెచ్చించే అవకాశం ఉంటుంది.

# నిధులు ఊడ్చేసి.. కార్మికులతో ఊడ్పిస్తూ

హైదరాబాద్ : పారిశుద్ధ్య కార్మికుల ప్రాణాలతో జీహెచ్ఎంసీ చెలగాటం ఆడుతోంది. నిధుల్లేవంటూ.. ప్రధాన రహదారులను శుభ్రం చేసే యంత్రాలను పక్కనపెట్టింది. ఇటీవల కాంట్రాక్టు గడువు ముగియగా టెండరును పునరుద్ధరించలేదు. బల్దియా కార్మికులతో రోడ్లు ఊడ్పిస్తున్నారు.

**ఏడాదికి రూ. 43 కోట్లు**

నగరంలోని ప్రధాన రహదారులపై 24 గంటలపాటు వాహనాల రాకపోకలుంటాయి. రాత్రిపూట గంటకు 100కి.మీ.కన్నా ఎక్కువ వేగంతో వాహనాలు దూసుకెళుంటాయి. వాహనాలు ఢీకొని అనేక మంది కార్మికులు చనిపోయారు. దీంతో భారాస హయాంలో 2018లో 18, 2021లో మరో 20 యంత్రాలను అందుబాటులోకి తెచ్చారు. 38 యంత్రాలకుగాను ఏటా రూ. 43 కోట్లు చెల్లిస్తున్నారు.

**స్వచ్ఛ ర్యాంకు కోసం..** నగరంలో రహదారులను యంత్రాలతో శుభ్రం చేయిస్తున్నామంటూ స్వచ్ఛభారత్ సర్వేలో బల్దియా మార్కులు పొందింది. ఉత్తమ పురస్కారాన్నీ గెలుచుకుంది. జులై 17న అవార్డు తీసుకునేందుకు అధికారులు దిల్లీ వెళ్తున్నారు. వాస్తవ పరిస్థితులు విరుద్ధంగా ఉన్నాయి. ఇతర మెట్రో నగరాలతో పోటీపడాలి. జీహెచ్ఎంసీని చూస్తే అలా పనిచేస్తున్నట్టు కనిపించడం లేదు. నిధుల్లేవని ఊడ్చే యంత్రాల సేవలను నిలిపేయడం సబబు కాదు. రహదారుల ప్రైవేటు నిర్వహణను కూడా అలాగే నిలిపేశారు అంటూ హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసుదుద్దీన్ ఒవైసీ బల్దియా కమిషనర్‌కు లేఖ రాశారు.

# కాగితాల్లో ఇళ్లు.. కనిపించని నిర్మాణాలు



కరీంనగర్ : నగర పరిధిలో ఆస్తిపన్ను, ఇంటినంబర్ జారీకి సంబంధించిన సెల్ఫ్ అసెస్‌మెంట్(స్వీయ మదింపు)పై విచారణ ముమ్మరం చేశారు. ఆన్‌లైన్‌లో యజమానుల దరఖాస్తులు ఆమోదించడం, క్షేత్రస్థాయిలో ఇల్లు ఉందా లేదా? అనే వివరాలు తెలుసుకోకపోవడంతో పొరపాట్లు జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలకు ఏరకంగా ఇంటినంబర్లు వచ్చాయో నగరపాలక, రెవెన్యూ అధికారులు అయిదారు రోజులుగా సర్వే చేస్తున్నారు. మూడేళ్ల నుంచి ఇప్పటివరకు జారీ చేసిన ఇంటి నంబర్లను తనిఖీ చేస్తున్నారు. ప్రస్తుతం రేకుర్తిలో చేస్తుండగా, బొమ్మకల్, తీగలగుట్టపల్లిలోనూ చేయనున్నారు.

**ఖాళీ స్థలాలకూ ఇంటి నంబర్లు**

రేకుర్తి ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలు అధికంగా ఉండటంతో అన్యాక్రాంతం అవుతున్నట్లు అయిదారు ఏళ్లుగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై రిజస్ట్రేషన్లు కూడా చేసుకోవడం, దర్జాగా ఇంటినంబర్లను ఆన్‌లైన్‌లో తీసుకోవడం సులువుగా మారింది. ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు ఇవ్వకూడదు. నివాసం ఉండేలా నిర్మించుకున్న గదులకు, ఇళ్లకు నంబర్లు జారీ చేయాలి. అదేది లేకుండానే మదింపు చేశారు. మూడు, నాలుగు గుంటలు స్థలముండి ఒక గది నిర్మించుకున్నా ఇంటినంబర్ జారీ అయ్యింది. ప్రస్తుతం నంబర్లు కాగితాల్లో కనిపిస్తుండగా మోఖా మీద ఇళ్లు మాత్రం కనిపించడం లేదు.

**సర్వేలో 189 గుర్తింపు**

ఒక్క రేకుర్తిలోనే ఇంటి నంబర్లు ఉండి నిర్మాణాలు లేనివి, ఒక గది మాత్రమే నిర్మించినవి, ప్రభుత్వ సర్వే నంబర్లలో ఉన్నవి ఇప్పటివరకు 189 గుర్తించారు. అధికారుల సర్వేలో నంబర్లు ఉన్నా ఇళ్లు కనిపించడం లేదు. గతేడాది ఇలాగే సర్వే చేసి అయిదు ఇంటినంబర్లు రద్దు చేశారు. ఇప్పుడు కూడా గుర్తించినవి రద్దు చేసి రిజిస్ట్రేషన్ శాఖకు లేఖ రాయనున్నారు.

**త్వరలో మరో రెండు కాలనీలు**

విలీన కాలనీల్లో స్వీయ మదింపులో అక్రమాలు బయటకు వస్తుండటంతో వీటిపై పూర్తిస్థాయిలో సర్వే చేయాలని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్వీయ మదింపు సమయంలో తప్పుగా ఇంటి విస్తీర్ణం, కొలతలు నిర్వహించుకున్న వారికి, తప్పుగా నంబర్లు తీసుకున్న వారికి 25 రెట్లు జరిమానా విధించాల్సి ఉంటుంది. కచ్చితంగా జరిమానా విధించాల్సిందేనని అధికారులు చెబుతుండగా, భవిష్యత్తులో లావాదేవీలు జరిపిన సమయంలోనైనా వీటిని వసూలు చేసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది.

# తనిఖీలు నామ‘మాత్ర’మే!

కరీంనగర్ : ఔషధ నియంత్రణపై పర్యవేక్షణ లేక ఉమ్మడి జిల్లాలో తరచూ నకిలీలు బయటపడుతున్నాయి. అడపాదడపా తనిఖీలతో అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా ఎక్కువ కమీషన్ వచ్చే ప్రాధాన్యత లేని మందులకే పెద్దపీట వేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 800కు పైగా ప్రైవేటు ఆస్పత్రులు, 2 వేలకు పైగా ఔషధ విక్రయ దుకాణాలున్నాయి. హెూల్‌సేల్‌గా విక్రయించే 180 ఏజెన్సీలున్నాయి. వీటి ద్వారా ప్రతి రోజూ రూ. 7-9 కోట్ల వ్యాపారం జరుగుతోంది.

**వారికంతా మామూలే!**

నాలుగు జిల్లాల పరిధిలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లతోపాటు ఉమ్మడి జిల్లా, రీజియన్ స్థాయి ఉన్నతాధికారుల పర్యవేక్షణ నిరంతరం కొనసాగాలి. ఒక్క కరీంనగర్ జిల్లాలోనే చిన్నాపెద్ద ఆస్పత్రులన్నీ 500కు పైగా ఉన్నాయి. వీటి పరిధిలోని మందుల దుకాణాల్లో నెలకోసారి కూడా తనిఖీలు నిర్వహించడం లేదు. కొందరు వ్యాపారులు దుకాణాల వద్దకు అధికారులు రాకుండా పలు రకాలుగా పలుకుబడిని ప్రయోగిస్తున్నట్లు వ్యాపార వర్గాల్లో చర్చ నడుస్తోంది. పలువురు అధికారులు తనిఖీలను ‘మామూలు’గా తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. గతేడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కేవలం 27 కేసులు మాత్రమే నమోదయ్యాయి. అంటే సగటున నెలకు రెండు చోట్ల సోదాలు నిర్వహించారు. ఈ విషయమై ఔషధ నియంత్రణ సహాయ సంచాలకులు శ్రీనివాస్ వివరణ



కోరగా తనిఖీల విషయంలో జాప్యం చేయడం లేదని, నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నామని చెప్పారు.

**చిన్న కేసులే అధికం**

సిరిసిల్ల జిల్లాలో తనిఖీ చేసిన ప్రతిసారీ ఆయుర్వేద సంబంధిత ఔషధాలే పట్టుబడ్డాయి. ముఖ్యంగా కిడ్నీలో రాళ్లు తొలగించడానికి, లావు తగ్గడానికి వాడే పొడి రూపంలోని మందులను, నిషేధిత పదార్థాలను పట్టుకున్నారు. గతేడాది అక్టోబరు 16న కరీంనగర్‌లో రూ. 4.87 లక్షల విలువైన ఈఎస్ఐ మందులను స్వాధీనం చేసుకున్నారు. కాగా అజ్ఞాత వ్యక్తులిచ్చిన ఫిర్యాదు ఆధారంగానే ఈ కేసు నమోదు చేశారు. మిగతా సోదాల్లో చిన్న చిన్న మాత్రలను మాత్రమే గుర్తించారు.
ముఖ్యంగా లైసెన్సులు లేని వాటి విషయంలో కఠినంగా వ్యవహరించడం లేదు. హిమాచల్‌ప్రదేశ్, హరియాణా రాష్ట్రాల్లో తయారైన నకిలీ ఔషధాలను కొన్ని దుకాణాల్లో స్వాధీనం చేసుకున్నారు.
కరీంనగర్‌లో జులై 11న యాంటీ క్యాన్సర్ ఇంజిక్షన్‌ను నిర్ణీత ధర కన్నా రూ. 668 అధికంగా అమ్ముతుండగా పట్టుకున్నారు. కేంద్రం నిర్ణయించిన ధరకు అదనంగా వసూలు చేస్తున్నందుకు కేసు పెట్టారు.

## అడ్డదారులే అక్రమాలకు మూలాలు..!

సత్తుపల్లి : ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించింది. ఓ దశలో రాష్ట్రవ్యాప్తంగా అధికార యంత్రాంగం విస్తృతంగా దాడులు జరిపి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసింది. అయితే ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా తయారయ్యాయి. ప్రధానంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సరిహద్దులో నిఘా నామమాత్రంగా ఉండటంతో ఇసుకాసురులు మళ్లీ తెలంగాణలోకి అడుగుపెడుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈప్రాంతంలో కొందరు నాయకులు ఇసుక మాఫియాకు కొమ్ముకాస్తుండటంతోనే ఈ పరిస్థితి దాపురించిందనే వాదనలూ వినిపిస్తున్నాయి.

**అమాంతం పెరిగిన గిరాకీ**

తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయటంతో ఈప్రాంతంలో ఇసుకకు గిరాకీ అమాంతం పెరిగింది. వాస్తవానికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సర్కారు ఉచితంగా ఇసుక అందజేస్తోంది. మణుగూరు రీచ్‌ల నుంచి ఇసుక రవాణాకు అధిక ఖర్చు అవుతుండటంతో సత్తుపల్లి, మధిర నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులు



ఏపీ నుంచి తెప్పించుకుంటున్నారు. పైగా మణుగూరు వద్ద రీచ్‌ల నుంచి లభించే దానికంటే ఏపీలోని రాజమహేంద్రవరం, విజయవాడ నుంచే వచ్చే ఇసుక బాగుంటుందని, సరసమైన ధరకు లభిస్తోందని చెబుతున్నారు. ప్రజల అవసరాన్ని కొందరు ఇసుకాసురులు అవకాశంగా మలచుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లు మాత్రమే కాకుండా ఇతర నిర్మాణాలు చేపడుతున్నవారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. తెలంగాణ ఖజానాకు గండికొడుతూ ఏపీ నుంచి యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తూ అక్రమంగా దండుకుంటున్నారు. ఏపీలో టన్ను ఇసుక ధర రూ.250–300 పలికితే.. తెలంగాణలో టన్ను ఇసుకకు రూ.550 వరకు డీడీ చెల్లించాలి. ఒక్కో లారీకి ఏపీ ఇసుకకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు లాభం వస్తుండటంతో అక్రమార్కులు ఈ దందాకు తెరలేపారు. ఒక్క సత్తుపల్లి నియోజకవర్గానికే ఏపీ నుంచి రోజుకు 15–20 లారీల ఇసుక వస్తుందంటే అక్రమ వ్యాపారం ఏస్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. పోలీసులు అడపాదడపా దాడులు జరిపి కేసులు నమోదుచేస్తున్నా ఇసుక అక్రమ దందాకు అడ్డుకట్ట పడటం లేదు. 'ఎక్కడికెక్కడ తనిఖీలు చేస్తున్నాం. ప్రత్యేక బృందాలు నిఘా పెట్టాయి. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడితే చర్యలు తీసుకుంటాం' అని ఏసీపీ ఎ.రఘుకు తెలిపారు.

## ఆకాశం వైపు.. అన్నదాత చూపు

కొత్తగూడెం: నైరుతి రుతుపవనాల రాకతో వర్షాలు ఊరించి ఊసూరుమనిపించాయి. మే మాసం ద్వితీయార్థంలోనే వానాకాలం మొదలైందని రైతులు భావించారు. ఆ తరువాత వరుణుడు ముఖం చాటేయటంతో జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. ముందస్తు తొలకరి జల్లులకు విత్తనాలు విత్తుకున్న అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మొలకెత్తని విత్తనాల స్థానంలో మళ్లీ విత్తుకునేందుకు కొందరు సిద్ధమవుతుండగా.. మొలకలు ఎండిపోకుండా నీళ్లు పోసి కాపాడుకునేందుకు మరికొందరు ప్రయత్నిస్తున్నారు. పగలు ఎండలు కాస్తున్నప్పటికీ సాయంత్రం పూట ఆకాశం మబ్బులు పడుతుండటంతో వర్షం కురుస్తుందని ఎదురుచూస్తున్న రైతులకు రోజూ నిరాశే ఎదురవుతోంది.

**ఐదు మండలాలు మినహా..**

జూలూరుపాడు, చంద్రుగొండ మండలాల్లో అధికంగా, టేకులపల్లి, సుజాతనగర్, అశ్వాపురం మండలాల్లో సాధారణ వర్షపాతం సంభవించగా.. మిగతా 18 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. జూన్ 1 నుంచి 18 నాటికి జిల్లావ్యాప్తంగా సాధారణ వర్షపాతం 89.20మి.మీ. నమోదుకావాల్సి ఉండగా.. కేవలం 43.40మి.మీ. వర్షం కురిసింది. గతేడాది జూన్ మాసంలో సగటు (134.40మి.మీ.) కంటే ఎక్కువగా 227.60మి.మీ. వర్షపాతం నమోదైంది. అయితే ఈసారి పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. కొన్ని మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. కరకగూడెం మండలంలో సాధారణ వర్షపాతం 97.30మి.మీ. కాగా ఇప్పటివరకు 2.30మి.మీ. వర్షం మాత్రమే కురిసింది. గుండాలలో 74.40మి.మీ.కు 10.30మి.మీ, పినపాకలో 96.70మి.మీ.కు 13.30మి.మీ. వర్షం నమోదైంది. మిగతా మండలాల్లోనూ ఇలాంటి పరిస్థితులే దర్శనమిస్తున్నాయి.

**భగీరథ ప్రయత్నమే..**

కరకగూడెం, గుండాల, ఆళ్లపల్లి తదితర మండలాల్లోని రైతులు తొలకరి వర్షాలకు పత్తి, మొక్కజొన్న, పెసర విత్తనాలు నాటారు. అవన్నీ మొలకలు వచ్చాయి. వర్షాలు ముఖం చాటేయటంతో మొక్కలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. బోర్లు, మోటార్లున్న రైతులు పొలాలను తడిపేందుకు స్ప్రింక్లర్లు వాడుతున్నారు. ఏ సౌకర్యం లేని కర్షకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిస్తేనే పంటలకు ప్రాణం అన్నట్లుగా పరిస్థితులు మారాయి.

**కరవుకు సంకేతమా..?**

ఎండాకాలంలో వర్షాలు, వర్షాకాలంలో ఎండలు వచ్చేంతగా పరిస్థితులు మారిపోయాయి. సాధారణంగా నైరుతి రుతుపవనాల కాలం జూన్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు ఉంటుంది. అవి ఈ ఏడాది వారం ముందే రుతుపవనాలు వచ్చేశాయి. ముందస్తు రాకను ముప్పునకు సంకేతంగా భావించాలని వాతావరణశాస్త్ర పరిశోధకులు చెబుతున్నారు. జూన్‌లో కురవాల్సిన వర్షపాతం కంటే లోటు ఎక్కువగా నమోదైంది. ఇది ఇలాగే కొనసాగితే కరవు పరిస్థితులు ఏర్పడేందుకు అవకాశాలు అధికమవుతాయి. వర్షాధార పంటలపై ప్రభావం పడుతుంది. రైతులు తక్కువ నీరు అవసరమయ్యే పంటల వైపు దృష్టిసారించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

**సాధారణం కంటే తక్కువ పంటల సాగు**

పంటల సాగుకు అనుకూలంగా వర్షాలు లేకపోవటంతో సాధారణం కంటే తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. జిల్లాలో రైతులు పత్తి–48,076, వరి–183, మొక్కజొన్న–659, పెసర–44 ఎకరాల్లో సాగుచేశారు. గతేడాది ఇదే సమయానికి వరి–1,175, పత్తి–77,878, మొక్కజొన్న–594, కంది–490 ఎకరాల్లో సాగయ్యాయి. మరోవైపు జులై చివరి నాటికి విత్తనాలు విత్తుకునే అవకాశముందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

## వలపు వల.. చిక్కితే విలవిల



హైదరాబాద్: ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌లో అందమైన యువతి హాయ్ అంటూ ముచ్చట్లు మొదలుపెడుతుంది. గంటల వ్యవధిలో చాటింగ్, కాల్ తర్వాత నేరుగా నగ్న వీడియో కాల్. నిజంగా యువతులు చేసినట్లు నమ్మితే నిండా మునిగినట్టే. సైబర్ నేరగాళ్లు డబ్బు కొట్టేయడానికి నగ్న వీడియోలతో బెదిరింపులకు పాల్పడుతున్నారు. నేరగాళ్లు ఆన్‌లైన్, సోషల్‌మీడియా నుంచి యువతుల ఫొటోలు సేకరించి వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ డీపీలుగా పెట్టుకుని సందేశాలు పంపిస్తారు. నిజంగానే యువతి అని భ్రమపడి కొందరు చాటింగ్ చేస్తూ వీడియో కాల్ వరకూ వెళ్తుంటారు. అవతలి వ్యక్తులు తాము నగ్నంగా ఉన్నామని, మీరూ ఉండాలంటూ నమ్మించి వీడియో రికార్డు చేస్తారు. వాటిని కుటుంబ సభ్యులకు పంపిస్తామని, సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తామని బెదిరించి డబ్బులు డబ్బులు డిమాండ్ చేస్తారు. వాస్తవానికి యువతుల పేరుతో సైబర్ నేరగాళ్లు అశ్లీల వెబ్‌సైట్ల నుంచి సేకరించిన నగ్న వీడియోలను వీడియో కాల్‌లో ప్రదర్శిస్తారు. తాజాగా ఓ విశ్రాంత ఉపాధ్యాయుడిని హనీ ట్రాప్ చేసి రూ.38 లక్షలు వసూలు చేసిన తీరు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. ఈ నేపథ్యంలోనే సామాజిక మాధ్యమాలు, కాల్స్‌లో యువతి పేరుతో మాట్లాడితే నమ్మొద్దని సైబర్‌క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

**ఇవీ జాగ్రత్తలు**

సామాజిక మాధ్యమాల్లో అపరిచిత నంబర్ల నుంచి యువతుల ఫొటోలతో సందేశాలు వస్తే నమ్మొద్దు.

అపరిచిత నంబర్ల నుంచి నేరుగా వీడియోకాల్ వస్తే స్పందించొద్దు.

కొన్నిసార్లు మనం ఎలాంటి కాల్ మాట్లాడకున్నా సామాజిక మాధ్యమాల నుంచి సేకరించిన ఫొటోలను నగ్నంగా మార్చి మోసగిస్తారు. వీటికి భయపడొద్దు. మోసం చేసినట్లు గుర్తిస్తే వాట్సప్, సామాజిక మాధ్యమాల్లో ఆయా నంబర్లపై రిపోర్టు చేసే వెసులుబాటు ఉంది. పదేపదే చేస్తే బ్లాక్ చేయాలి. మనం చేసిన రిపోర్టు ఆధారంగా ఆయా సంస్థలు చర్యలు తీసుకుంటాయి.

ఒకవేళ మోసపోతే నేరుగా 1930 టోల్‌ఫ్రీ నంబరు లేదా.. స్థానిక పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయాలి.

## సంరక్షణే అసలు సమస్య!



మల్యాల : పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కింద నాటుతున్న మొక్కల సంరక్షణపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతంలో పలుమార్లు నాటినచోటే మళ్లీ నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది జిల్లాలోని 18 మండలాల్లో 37.44 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించనట్లు అధికారులు తెలిపారు. అందులో 12 లక్షల మొక్కలను ఇళ్ల ఆవరణలో నాటడానికి గ్రామస్థులకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. కరివేపాకు, మునగ, జామ, నిమ్మ, పూల మొక్కలు అందజేస్తామన్నారు. రహదారుల పక్కన వేప, చింత, కానుగ తదితల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**85 శాతం ఉంటేనే బిల్లుల మంజూరు** గ్రామాల్లో ఏటా నాటే మొక్కల సంరక్షణకు ప్రభుత్వం లక్షలాది రూపా యలు ఖర్చు చేస్తోంది. ప్రతి మండలంలో దాదాపు 1.50 లక్షల వివిధ రకాల మొక్కలను నాటి సంరక్షించడానికి దాదాపు రూ.2 కోట్ల వరకు నిధులు వెచ్చిస్తున్నట్లు అధికారుల ద్వారా సమాచారం. గ్రామపంచాయతీ పరిధిలో నాటిన మొక్కల్లో 85 శాతం బతికితేనే నిధులు చెల్లించాలి. కానీ నాటిన మొక్కల్లో 25 నుంచి 50 శాతం వరకు మాత్రమే మనుగడ ఉంటోంది. మొక్కలు నాటిన ప్రాంతాన్ని వాటి వివరాలను ఉపాధి సిబ్బంది జియోట్యాగింగ్ విధానంతో అనుసంధానం చేస్తున్నట్లు పేర్కొంటున్నా ఎక్కడ ఎన్ని మొక్కలు ఉన్నాయి, ఎన్ని కనుమరుగయ్యాయన్న వివరాలు మాత్రం వెల్లడించడంలేదు. పశువులు తొక్కడం, మేయడంతో మొక్కలు దక్కడంలేదని సిబ్బంది పేర్కొంటున్నారు. రహదారులు, ఇళ్ల ముందు నాటిన మొక్కలు ఎదిగిన తర్వాత కోతుల బెడద కారణంగా ఇంటి యజమానులు నరికివేస్తున్నారు.

**నిధుల రికవరీ– రఘువరన్, డీఆర్డీవో జగిత్యాల**

ఈ సంవత్సరం జిల్లాలో 37.44 లక్షల మొక్కలు నాటడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. నాటినవాటిలో 85 శాతం దక్కకపోతే ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు, క్షేత్రసహాయకులదే బాధ్యత. ఉపాధి పనుల సామాజిక తనిఖీ సమయంలో విచారణ సిబ్బందికి మొక్కలు కనిపించకపోతే వారి నివేదికల ప్రకారం నిధులు రికవరీ చేస్తాం. మొక్కల జియోట్యాగింగ్ వివరాలను అటవీ అధికారులకు అందజేస్తే వారే సమాచారాన్ని ఎంట్రీ చేస్తారు.

## దాతల సాయం.. పాఠశాలకు జీవం




ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ గ్రామ ప్రాథమిక పాఠశాలలో గతేడాది కేవలం 20 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో పాటు పాఠశాలలో సౌకర్యాల లేమితో మూతపడే స్థితికి చేరింది. ఈ క్రమంలో బదిలీపై నూతన ఉపాధ్యాయులు రావడంతో సంవత్సర కాలంలో పాఠశాల రూపురేఖలను మార్చేశారు. విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు, పాఠశాలలో అభివృద్ధి పనులు అత్యవసరమని గుర్తించారు. ఇందుకోసం దాతలను సంప్రదించి విరాళాలు సేకరించి సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థుల సంఖ్యను 70కి పైగా పెంచారు. పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పిస్తేనే తల్లిదండ్రులకు పాఠశాలపై నమ్మకం కలిగి విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరిం చిన అచ్చ విజయభాస్కర్‌తో పాటు ఉపాధ్యాయులు భావించారు. గ్రామస్థులతో వాట్సప్ గ్రూపును ఏర్పాటు చేసి పాఠశాలలో చేపట్టిన కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, సమస్యలను గ్రామస్థుల దృష్టికి తీసుకెళ్లారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఏడాదిలోనే సుమారు రూ.4 లక్షల వరకు విరాళాలు అందజేశారు. ఆ నిధులతో అసంపూర్తిగా ఉన్న మూత్రశాలలు, నీటిట్యాంకు, పైపుల పనులను పూర్తి చేయడం, పిల్లలు ఆడుకునే పరికరాలు, గోడలకు రంగులు, చిత్రాలు, పోడియం, ప్రింటర్, సీసీ కెమెరాల ఏర్పాటు, నెట్ సౌకర్యం కల్పించారు. గ్రామానికి చెందిన మంగిలిపల్లి మహిపాల్ విదేశాల్లో వ్యాపారం చేస్తుంటారు.

పాఠశాలలో మూత్రశాలల నిర్మాణం నిలిచి పోవడంతో పాటు ఇతర సమస్యలపై 'ఈనాడు'లో కథనం వచ్చింది. కథనానికి స్పందించి మొదట రూ.1.10 లక్షలతో మూత్రశాలల నిర్మాణం, నీటి సౌకర్యాన్ని పూర్తి చేయించారు. రూ.95 వేలతో పాఠశాల గోడలకు రంగులు, దేశ నాయకుల, ఇతర చిత్రాలను గీయించడం, రూ.80 వేలతో పిల్లలు ఆడుకునే జారుడు బల్ల, ఉయ్యాల, ఇతర ఆట పరికరాలను ఏర్పాటు చేయించారు. పాఠశాల వార్షికోత్స వానికి రూ.15వేల నగదును మొత్తంగా రూ.3లక్షలు విరాళంగా అందించారు. **పెరిగిన విద్యార్థుల సంఖ్య– విజయభాస్కర్, ప్రధానోపాధ్యాయుడు** పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులు ముందుకు వస్తున్నారు. వారి సాయంతో పాఠశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు నాణ్యమైన బోధన, వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతుండడంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. పాఠశాల అభివృద్ధికి మహిపాల్ రూ.3 లక్షల వరకు అందజేశారు.

## మురుగు.. కనుమరుగయ్యేలా..

ఖమ్మం : గతేడాది భారీ వర్షాలకు వరద ముంచెత్తటంతో ఖమ్మం నగరవాసులు విలవిలలాడారు. గతంలో కృష్ణాజలాలు పారిన ఎన్నెస్పీ కాల్వ ఇప్పుడు దుర్గంధభరితంగా మారింది. హరిత ట్రైబ్యునల్ ఆదేశాలకు విరుద్ధంగా చెరువులు, మున్నేరులోకి కలుషిత జలాలు చేరుతున్నాయి. స్వచ్ఛ ఖమ్మం కల సాకారానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో అమృత్ పథకంలో భాగంగా తొలివిడతలో రూ.239కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ(అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులు చురుగ్గా సాగుతున్నాయి.

**పూడిక మట్టితో కట్ట ఎత్తు పెంచి..**

అమృత్ నిధులతో ఖమ్మం నగరంలో ఎన్నెస్పీ కాల్వను విస్తరించటంతో పాటు యూజీడీ, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు(సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు) నిర్మించాల్సి ఉంది. ప్రస్తుత వర్షాకాలంలో వరద ముప్పు పొంచి ఉండటంతో ఎన్నెస్పీ కాల్వలో పూడిక తీశారు. కాల్వను విస్తరించి పూడిక మట్టితో కట్ట ఎత్తు పెంచారు. కబేళా ప్రాంతంలోని అబ్దుల్‌కలాం కాలనీలో ఎన్నెస్పీ కాల్వ పక్కనే యూజీడీ పనులు చేపడుతున్నారు. భూమిలో కాల్వ తవ్వి పైపులు వేశాక పూడ్చేసి మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేస్తున్నారు. తొలి విడత నిధులతో 8.30కి.మీ. వరకు యూజీడీ పైపులైన్ వేయాల్సి ఉండగా.. ఇల్లెందు రోడ్డు, అయ్యప్ప దేవాలయం, బైపాస్, సీఆర్జీ టవర్స్, కబేళా ప్రాంతం, ఖానాపురం హవేలి పరిధిలో 3.10కి.మీ. మేర పనులు పూర్తయ్యాయి.

**ఊరచెరువుకు విముక్తి**

పట్టణీకరణతో 30ఏళ్లలో పెరిగే జనాభాను దృష్టిలో ఉంచుకొని మూడు



డ్రైనేజీ జోన్ల పరిధిలో యూజీడీ పనులు చేపడుతున్నారు. నగరంలో ప్రతి ఇంటికీ 150 లీటర్ల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు. అందులో 80శాతం నీరు తిరిగి మురుగుకాల్వల్లోకి చేరుతుందని అంచనా. కలుషిత జలాలు 35 మురుగుకాల్వల ద్వారా ఖానాపురం హవేలిలోని ఊరచెరువు, ఎన్నెస్పీ కాల్వ, పుట్టకోట చెరువులోకి ప్రవహిస్తున్నాయి. యూజీడీ ఏర్పాటుతో ఊరచెరువు, ఎన్నెస్పీ కాల్వలోకి వృథానీరు చేరదు. జల కాలుష్యం తగ్గుతుంది. ఆ డ్రైన్లన్నింటినీ యూజీడీ మ్యాన్‌హోల్ ద్వారా పైపులైన్లకు అనుసంధానిస్తారు. వర్షాకాలంలో వరదనీరు ఎన్నెస్పీ కాల్వలో ప్రవహిస్తుంది. మిగిలిన కాలాల్లో కాల్వ ఖాళీగా ఉంటుంది. మ్యాన్‌హోల్‌ను శుభ్రపరచటానికి కార్మికుల అవసరం లేకుండా జెట్టింగ్ మిషన్ వాడనున్నారు. యూజీడీ పైపులైన్‌ను దిగువనున్న పుట్టకోట, ధంసలాపురం చెరువులకు అనుసంధానిస్తారు. మురుగునీరు చెరువులో కలవటానికి ముందు ఎస్టీపీ ద్వారా శుద్ధి చేస్తారు. ఇందుకోసం ధంసలాపురంలో 44 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్స్ పర్ డే), పుట్టకోటలో 9.50 ఎంఎల్‌డీ సామర్థ్యమున్న ఎస్టీపీలు నిర్మించనున్నారు. వాటి నుంచి శుద్ధజలాలు చెరువుల్లో కలుస్తాయి. నగరం విస్తరించాక.. శుద్ధజలాలను రివర్స్ పంపింగ్ ద్వారా పరిసర కాలనీల్లోని ఉపరితల ట్యాంకుల్లోకి పంపి మరుగుదొడ్లు, పార్కుల అవసరాలకు వినియోగించనున్నారు. 'అమృత్ నిధులతో చేపట్టే యూజీడీ, ఎస్టీపీల నిర్వహణ బాధ్యత పదేళ్ల వరకు గుత్తేదారుదే'నని మున్సిపల్ ప్రజారోగ్యశాఖ ఎస్ఈ వి.రంజిత్ 'ఈనాడు'కు తెలిపారు.

కేఎంసీ పరిధిలో అమృత్ పథకం స్వరూపం

యూజీడీ ప్రాజెక్టు విలువ: రూ.1,439కోట్లు

మొదటి విడతలో మంజూరైన నిధులు: రూ.239కోట్లు

చేపడుతున్న పనులు: ఎస్టీపీలు, యూజీడీ, ఎన్నెస్పీ కాల్వ విస్తరణ

పనుల గడువు: 2026 మార్చి 31

ప్రయోజనం పొందనున్న ప్రజలు: 3 లక్షలు

యూజీడీ నిర్మించే డివిజన్లు: 1 నుంచి 12, 14–16, 20, 21, 41.

## దోమలపై యుద్ధానికి సన్నద్ధం

కొత్తగూడెం : జిల్లా వ్యాప్తంగా విషజ్వరాలు ప్రబలుతుండటంతో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. దోమల నివారణపై దృష్టి సారిస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే దాదాపు 8వేల మంది జ్వర బాధితులు అధికారికంగా తేలారు. చాలామంది జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ఇలాంటి పరిస్థితులను వర్షాలు పెరగక ముందే చక్కదిద్దేందుకు అధికారులు యత్నిస్తు న్నారు. జిల్లా వ్యాప్తంగా 29 పీహెచ్‌సీలు, 6 యూపీహెచ్‌సీలు, 234 ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రజలను అప్రమత్తం చేసేందుకు మండల వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. సమన్వయంతోనే సాధ్యం: నగరపాలిక, పురపాలికలు, గ్రామ పంచాయతీల్లోని మురుగు కాల్వల్లో పూడికతీత పనులు పూర్తిస్థాయిలో చేపట్టడం లేదు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, ప్లాస్టిక్ కవర్స్, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి కంపుకొడుతున్నాయి. ఇలాంటి ప్రాంతాలు దోమలకు ఆవాసాలుగా మారే ప్రమాదం పొంచి ఉంది. బహిరంగ ప్రదేశాల్లోనే తాగి పడేసిన కొబ్బరి బోండాలు కుప్పలుకుప్పలుగా దర్శనమిస్తున్నాయి. ఇలాంటి వాటిల్లో దోమలు సత్వరంగా వృద్ధి చెందే ఆస్కారం ఉంది. ప్రభుత్వ శాఖల సమన్వయంతో దోమల నిలయాలైన మురుగు కాల్వలు, నీటి గుంతల్లో లార్వాలను ధ్వంసం చేసే ప్రక్రియను పూర్తి స్థాయిలో చేపట్టాలి. వైద్య, ఆరోగ్య శాఖ దోమల నివారణకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అమలుకు నగరపాలిక/పురపాలికలు, గ్రామ పంచాయతీల సమన్వయం తప్పనిసరి.

వర్షాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వైద్య సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తున్నాం. ప్రతి ఇళ్లల్లో డ్రైడే పాటించేలా అవగాహన పెంపొందించాలని ఆశా కార్యకర్తలకు సూచించాం. ఎల్.భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌వో జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా జ్వరాల బాధితులు: 8,856

జ్వర బాధితుల్లో తేలిన టైఫాయిడ్ కేసులు: 110మలేరియా కేసులు: 33పీఎఫ్ కేసులు: 30పీవీ కేసులు: 03డెంగీ కేసులు : 05అందుబాటులో నివారణ అస్త్రాలు..

గంబూషియా చేపలు: 2 లక్షలుఆయిల్ బాల్స్: 20,000



## తెదేపాకు రాజీనామా చేస్తూ అశోక్ గజపతి భావోద్వేగం

విజయనగరం రూరల్, సింహాచలం : గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతి రాజు తెదేపా శాశ్వత సభ్యత్వానికి, పార్టీ పొలిట్ బ్యూరో పదవికి రాజీనామా చేశారు. తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకి, పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకి లేఖ పంపించారు. కుటుంబ సమేతంగా సింహాచలం అప్పన్నస్వామిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో రాజీనామా పత్రాలపై అశోక్ గజపతిరాజు సంతకాలు చేశారు. తన రాజీనామాను ఆమోదించాలని తెదేపా అధినేత చంద్రబాబును కోరారు. తెదేపా సభ్యుడిగా, నాయకుడిగా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రాజీనామా పత్రాలపై సంతకాలు చేసిన సందర్భంగా అశోక్‌గజపతిరాజు మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. 1978లో తొలిసారి శాసనసభ్యుడిగా ఎన్నికైనప్పుడు అప్పన్నస్వామిని దర్శించుకున్న అనంతరం అసెంబ్లీకి వెళ్లినట్లు ఆయన గుర్తు చేసుకున్నారు. గవర్నర్‌గా ఎంపికైన నేపథ్యంలో స్వామి దర్శనం అనంతరం పదవి చేపట్టనున్నట్లు తెలిపారు. తాను సుదీర్ఘకాలం కొనసాగిన పార్టీకి రాజీనామా చేయడం బాధాకరంగా ఉందని భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నారు. పసుపు రంగు పవిత్రతకు ప్రతిరూపమని ఆ పవిత్రతను కాపాడేలా పనిచేస్తానని చెప్పారు. రాజీనామా విషయం ఇప్పటికే పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుతో ఫోన్‌లో మాట్లాడి ఆమోదం తీసుకున్నట్లు అశోక్ గజపతిరాజు తెలిపారు.



## వాళ్లకు పోలవరంపై మాట్లాడే హక్కు ఉందా?

విశాఖ: రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు సీఎం చంద్రబాబు తీవ్రంగా కృషి చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. పోలవరం ఎప్పటికీ పూర్తికాదు.. ఎవరికీ అర్థం కాదని గతంలో వైకాపా నేతలు మాట్లాడారని గుర్తుచేశారు. పోలవరాన్ని ప్రశ్నార్థకం చేసినవారికి ఇవాళ మళ్లీ మాట్లాడే నైతిక హక్కు ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కనీసం ప్రతిపక్ష హోదా కూడా తెచ్చుకోలేని వ్యక్తి అడుగడుగునా అభివృద్ధికి అడ్డుపడుతున్నారన్నారు. "జగన్ హయాంలో గత ప్రభుత్వం పోలవరాన్ని ధ్వంసం చేసింది. 2027 డిసెంబర్ కల్లా ఈ ప్రాజెక్టు పూర్తిచేసి గోదావరి వరద నీరు ఉత్తరాంధ్రకు, రాయలసీమకు ఇవ్వాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. ప్రకాశం జిల్లా అత్యంత వెనకబడిన జిల్లా. వెలిగొండ ప్రాజెక్టు దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉంది. దాన్ని 2026 కల్లా పూర్తి చేసి ప్రకాశం జిల్లాకు నీరిస్తాం. గత ప్రభుత్వం రుషికొండ ప్యాలెస్ నిర్మించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది. దాన్ని ఏవిధంగానూ వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. ఐదు సంవత్సరాలు జగన్ ఉత్తరాంధ్రపై కపటప్రేమ చూపించారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ పూర్తి చేసి ఉంటే ఇవాళ పురుషోత్తపట్నం నుంచి విశాఖ, ఉత్తరాంధ్రకు నీరు వచ్చేది" అని నిమ్మల రామానాయుడు తెలిపారు.

## తితిదే ఈవో పేరుతో ఫేస్‌బుక్‌లో ఫేక్ అకౌంట్



తిరుమల: తితిదే ఈవో జె.శ్యామలరావు పేరిట ఫేస్‌బుక్‌లో ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసినట్లు తితిదే గుర్తించింది. గుర్తుతెలియని వ్యక్తులు నకిలీ ఖాతాను సృష్టించి.. డబ్బులు కావాలని భక్తులకు సందేశాలు పంపుతున్నారని తెలిపింది. ఇది పూర్తిగా మోసగాళ్ల చర్య అని.. భక్తులు అప్రమత్తంగా ఉండాలని తితిదే పేర్కొంది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. "భక్తులు ఇలాంటి ఫేక్ అకౌంట్లకు దూరంగా ఉండాలి. ఎవరికైనా అనుమానాస్పద సందేశాలు వస్తే వెంటనే తితిదే విజిలెన్స్ విభాగానికి తెలియజేయాలి. తితిదే విజిలెన్స్ నంబర్ 9866898630 లేదా టోల్‌ఫ్రీ నంబర్ 18004254141కు కాల్ చేసి సమాచారం అందించవచ్చు. భక్తులు కేవలం తితిదే అధికారిక వెబ్‌సైట్ %ఝఝ్.అతీబఝ్రీఝ.శీతీస్త్ర% లేదా సోషల్ మీడియా అధికారిక ఖాతాల ద్వారా వచ్చే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలి" అని తితిదే విజ్ఞప్తి చేసింది.

## రప్పా రప్పా నరుకుతామన్న జగన్‌ను ప్రజలంతా ఛీకొట్టాలి: మంత్రి అనిత



పెదకూరపాడు: అధికారంలోకి వస్తే 'రప్పా రప్పా' నరుకుతామని చెబుతున్న జగన్‌ను ప్రజలు ఛీ కొట్టాలని హోం మంత్రి అనిత పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేకనే హింసా రాజకీయాలకు జగన్ తెరలేపారని ఆమె విమర్శించారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం కంభంపాడులో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో కలిసి అనిత పాల్గొన్నారు. కంభంపాడులో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నూతనంగా నిర్మించిన కంభంపాడు– జలాలపురం రహదారిని ప్రారంభించారు.

## ఒక్క బిడ్డకే మేనమామనని జగన్ తప్పించుకున్నారు: మంత్రి నిమ్మల



విశాఖపట్నం: పిల్లల్ని స్కూలుకు పంపించండి నేను చదివించుకుంటానని చెప్పిన జగన్.. అధికారంలోకి రాగానే ఒక్క బిడ్డకే మేనమామనంటూ ఆయన తప్పించుకున్నారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సీఎం చంద్రబాబు మాత్రం ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే.. వారందరికీ తల్లికి వందనం అందజేస్తున్నారని చెప్పారు. విశాఖ జిల్లా ఆనందపురం మండలం గిడిజాలలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి నిమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ సంవత్సర పాలనపై ప్రజలంతా పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఒకేసారి రూ.1000, రూ.3000, రూ.5000 పింఛన్లు పెంచి చంద్రబాబు మానవీయతను చాటుకున్నారని లబ్ధిదారులే చెబుతున్నారని గుర్తుచేశారు. ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. ఆగస్టు 15 నాటికి డీఎస్సీ ద్వారా సుమారు 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసి.. ప్రభుత్వ పాఠశాలలకు మరింత నాణ్యమైన విద్యను అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.



## నిమిష ప్రియ కేసు.. అది కేంద్రాన్నే అడగండి: సుప్రీంకోర్టు

దిల్లీ: యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటోన్న కేరళ నర్సు నిమిష ప్రియ కేసులో ఉత్కంఠ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ కేసులో బాధిత కుటుంబంతో మాట్లాడేందుకు తాము యెమెన్‌కు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని నిమిష తరఫున బృందం సుప్రీంకోర్టును కోరింది. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ.. అందుకోసం కేంద్ర ప్రభుత్వం వద్దకే వెళ్లాలని సూచించింది. నిమిష ప్రియ కేసుపై తాజాగా అత్యున్నత న్యాయస్థానం మరోసారి విచారణ జరిపింది. ఈసందర్భంగా ఆమెకు మరణశిక్ష అమలును యెమెన్ తాత్కాలికంగా నిలిపివేసిన విషయాన్ని కేంద్రం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లింది. ఈ కేసులో తమవైపు నుంచి చర్యలు కొనసాగుతున్నాయని కేంద్రం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి కోర్టుకు తెలిపారు. ఆమె క్షేమంగా స్వదేశానికి తిరిగిరావాలని ప్రభుత్వం కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందనపై ధర్మాసనం సంతృప్తి వ్యక్తంచేసింది. నిమిష ప్రియ కేసులో కేంద్రం సాధ్యమైన ప్రయత్నాలు చేస్తోందని తెలిపింది. విచారణ సందర్భంగా నిమిష ప్రియ తరఫున న్యాయవాదుల బృందం కోర్టుకు ఓ అభ్యర్థన చేసింది. ఈ కేసులో బాధిత కుటుంబంతో సంప్రదింపులు జరిపేందుకు వీలుగా యెమెన్ వెళ్లేందుకు తమకు అనుమతి ఇవ్వాలని కోరింది. దీనిపై స్పందించిన ధర్మాసనం.. ప్రస్తుతం ఆ దేశానికి వెళ్లకుండా ప్రయాణ ఆంక్షలు ఉన్నందున దీనిపై కేంద్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొంది. ఇందుకోసం ప్రభుత్వం వద్ద అభ్యర్థన చేసుకునేలా పిటిషనర్లకు అనుమతి కల్పించింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను ఆగస్టు 14వ తేదీకి వాయిదా వేసింది. యెమెన్ దేశస్థుడి హత్య కేసులో నిమిష ప్రియకు జులై 16న మరణశిక్ష అమలుచేయాల్సిఉండగా.. చివరి నిమిషంలో అక్కడి ప్రభుత్వం దీన్ని వాయిదా వేసింది. బ్లడ్ మనీపై బాధిత కుటుంబంతో చర్చలు జరిపేందుకు మరింత సమయం ఇవ్వాలని భారత ప్రభుత్వం చేసిన అభ్యర్థనకు ఆ దేశం సానుకూలంగా స్పందించింది. అయితే, ఈ బ్లడ్ మనీకి తాము ఎన్నటికీ అంగీకరించబోమని బాధిత కుటుంబం చెబుతోంది. దీంతో ఈ కేసు ఎలా ముగుస్తుందోన్న ఉత్కంఠ నెలకొంది.



## మిథున్‌రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

### ఏపీ మద్యం కేసు.. వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

దిల్లీ: మద్యం కుంభకోణం కేసులో (ఏ4) నిందితుడు, వైకాపా ఎంపీ పీవీ మిథున్‌రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. మద్యం కేసులో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. అరెస్టు చేయకుండా ఛార్జిషీట్ ఎలా దాఖలు చేశారని జస్టిస్ పార్థివాలా, జస్టిస్ మహదేవన్‌ల ధర్మాసనం సిట్ తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. ముందస్తు బెయిల్ పొందడానికి ఎలాంటి కారణాలు ఉన్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాదిని ధర్మాసనం అడిగింది. విచారణ అనంతరం ముందస్తు బెయిల్ కోసం మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. లొంగిపోవడానికి సమయమిచ్చేందుకు కూడా సుప్రీంకోర్టు విముఖత చూపింది. మద్యం కేసులో ముందస్తు బెయిలు కోసం మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను ఇటీవల ఏపీ హైకోర్టు కొట్టేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మద్యం కుంభకోణం కేసులో మిథున్‌రెడ్డిపై సిట్ అధికారులు ఇప్పటికే లుకౌట్ సర్క్యులర్ (ఎల్వోసీ) జారీ చేశారు. ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిన నేపథ్యంలో.. విదేశాలకు పారిపోకుండా అడ్డుకునేందుకు ఈ ఎల్వోసీ ఇచ్చారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేసే అవకాశముందని ముందే గ్రహించిన మిథున్‌రెడ్డి అప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన ఎక్కడ దాక్కున్నారో తెలుసుకునేందుకు సిట్ బృందాలను ఏర్పాటు చేసింది. మద్యం కుంభకోణం కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత మిథున్‌రెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిపోవటం ఇది రెండోసారి. ఈ కుంభకోణంలో తన ప్రమేయం సిట్ దర్యాప్తులో బయటపడిందని తెలియగానే మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ కోసం మార్చిలో హైకోర్టుకు వెళ్లారు. అప్పటికి ఆయన్ను ఈ కేసులో నిందితుడిగా చేర్చకపోవడంతో కోర్టు ఆ పిటిషన్‌ను కొట్టేసింది. తనను అరెస్టు చేస్తారేమోననే భయంతో మిథున్‌రెడ్డి అప్పట్లో అజ్ఞాతంలో ఉంటూనే.. సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కోర్టులో విచారణ కొనసాగినంత కాలం అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలివ్వటంతో బయటకొచ్చారు. ఇప్పుడు మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. మిథున్‌రెడ్డి ఆచూకీ తెలిస్తే.. ఆయన్ను సిట్ అధికారులు వెంటనే అరెస్టు చేసే అవకాశముంది.



## కడప సెంట్రల్ జైలులో డీఐజీ విచారణ..

### ఎర్రచందనం స్మగ్లర్ నుంచి 10 సెల్‌ఫోన్లు స్వాధీనం!

కడప: కడప కేంద్ర కారాగారంలో ఖైదీల వద్ద సెల్‌ఫోన్లు పట్టుబడుతుండటంపై జైళ్ల శాఖ డీజీ విచారణకు ఆదేశించారు. ఈక్రమంలో కడప జైలులో రాజమహేంద్రవరం జైలు డీఐజీ రవికిరణ్ విచారణ చేపట్టారు. ఖైదీలతో పాటు సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. కడప జైలులో పీడీ యాక్ట్ కింద అరెస్టై రిమాండ్ ఖైదీగా ఉన్న వ్యక్తి నుంచి 10 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆ రిమాండ్ ఖైదీ ఎర్రచందనం స్మగ్లర్‌గా తెలుస్తోంది. సెల్‌ఫోన్లపై వ్యవహారంలో జైలు సిబ్బంది పాత్రపై అనుమానాలు వ్యక్తమవడంతో జైళ్లశాఖ డీజీ సీరియస్‌గా తీసుకున్నారు. ఈమేరకు విచారణకు ఆదేశించారు.

## ఇంటర్ విద్యార్థిని హత్య కేసులో వీడని మిస్టరీ.. వివిధ కోణాల్లో పోలీసుల దర్యాప్తు

గండికోట: కడప జిల్లా గండికోట ఇంటర్ విద్యార్థిని హత్య కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. హత్య కేసు ఇంకా మిస్టరీగానే ఉంది. గురువారం రాత్రి విద్యార్థిని సోదరుడు సురేంద్ర, మరో వ్యక్తి కొండన్నను పోలీసులు విచారించి పంపించారు. సాంకేతిక ఆధారాల కోసం దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థినిని బాగా హింసించి చంపారని నిర్ధరించారు. గండికోట రంగనాయక స్వామి ఆలయం వద్ద కాలేజీ బ్యాగు లభ్యం కాగా.. మరోచోట మృతదేహం కనిపించడంపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఒకచోట చంపి మరోచోట పడేశారని భావిస్తున్నారు. విద్యార్థిని కుటుంబ సభ్యులు, గండికోటకు వచ్చిన అల్లరి మూకలను ప్రశ్నిస్తున్నారు. పోలీసులు మరోసారి సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు.



## ఏపీ మద్యం కుంభకోణంపై ఈడీ విచారణ జరపాలి: తెదేపానేత సోమిరెడ్డి



అమరావతి: ఏపీ మద్యం కుంభకోణంపై ఈడీ ఇంకా ఎందుకు విచారణ జరపట్లేదని తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ కుంభకోణంపై ప్రధాని నరేంద్ర మోదీ దృష్టి సారించాలని కోరారు. బిగ్‌బాస్ అండతో రూ.3,200 కోట్ల దోపిడీ చేసిన నేరగాళ్ల పనిపట్టాలన్నారు.

30 వేల మంది ప్రాణాలు తీసి లక్షల మందిని అనారోగ్యంతో మంచాన పడేశారని ధ్వజమెత్తారు. మద్యం స్కామ్ సూత్రధారుల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈడీ వెంటనే స్పందించి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## మ్యారీడ్ హీరోయిన్ రెబలిజం

తనదైన అందం, నట ప్రతిభతో దాదాపు రెండు దశాబ్ధాల పాటు పరిశ్రమను ఏలింది కత్రిన కైఫ్. 2003లో బూమ్ అనే చిత్రంతో బాలీవుడ్ కి పరిచయమైంది. ఆ తర్వాత వెంకీ సరసన మల్లీశ్వరి చిత్రంతో టాలీవుడ్ కి పరిచయమైంది. బాలీవుడ్, టాలీవుడ్ లో టాప్ హీరోల సరసన నటించిన కత్రిన ఇటీవల పూర్తిగా ప్రయివేట్ లైఫ్ కి ప్రాధాన్యతనిస్తోంది. బాలీవుడ్ స్టార్ హీరో విక్కీ కౌశల్ ని పెళ్లాడిన కత్రిన ఆ తర్వాత సినిమాల పరంగా వేగం తగ్గించింది. సల్మాన్ తో టైగర్ ఫ్రాంఛైజీలో నటిస్తోంది. 2023లో టైగర్ 3, 2024 లో మెర్రి క్రిస్మస్ చిత్రాల్లో నటించిన కత్రిన, 2025లో ఇంకా ప్రాజెక్ట్ ని ప్రకటించలేదు. కొన్ని నెలలుగా కత్రిన ప్రెగ్నెన్సీ గురించి పుకార్లు వినిపిస్తున్నా దానిని అధికారికంగా కన్ఫామ్ చేయలేదు. మరోవైపు కత్రిన ఫోటోషూట్ల పరంగాను ఇతరులతో పోలిస్తే వెనకబడి ఉంది. సోషల్ మీడియాల్లో రేర్ గా మాత్రమే స్పెషల్ ఫోటోషూట్లను షేర్ చేస్తోంది. నిన్ననే బర్త్ డే జరుపుకున్న ఈ బ్యూటీకి ప్రియాంక చోప్రా,



కరీనా సహా ఇండస్ట్రీ సహచరులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు కత్రిన తదుపరి సినిమా ప్రకటన గురించి ఆసక్తిగా వేచి చూస్తున్నా దానికి సంబంధించి ఎలాంటి ప్రకటనా వెలువడకపోవడం ఆశ్చర్యపరిచింది. తాజాగా కత్రిన త్రోబ్యాక్ ఫోటోషూట్ ని షేర్ చేసిన %-%ఎల్లే ఇండియా%-% మ్యాగజైన్ దీనికి ఆసక్తికర క్యాప్షన్ ఇచ్చింది. ఎల్లే వివరాల ప్రకారం.. ఇది 2019లో తీసిన ఫోటోషూట్. ఆ సమయంలో ఎప్పుడూ ఆకర్షణీయంగా ఉండే కత్రిన మా కవర్‌ను అందమైన శైలిలో అలంకరించింది. కత్రిన రెడ్ కార్పెట్ నడకలు, వెండితెర వెలుగులు ప్రతిదీ గేమ్ ఛేంజరే. క్లీన్ లైన్స్, బోల్డ్ సిల్హౌట్‌లు ఎక్కువ ప్రయత్నించకుండానే అందరి దృష్టిని ఆకర్షించే నిశ్శబ్ద విశ్వాసం కత్రిన. బాలీవుడ్ పవర్ హౌస్ గా ఏల్తున్న కత్రిన నిజమైన క్వీన్ అని ఎల్లే ప్రశంసించింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. కత్రిన రకరకాల డిజైనర్ దుస్తుల్లో అందంగా ఫోజులిచ్చింది. ఇందులో బికినీ ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. మ్యారీడ్ హీరోయిన్ రెబలిజం అంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. అయితే విక్కీని కత్రిన 2021లో పెళ్లాడింది. అంతకంటే ముందే ఈ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ అయింది.

## డిమాండ్ వల్లే అమ్మడికి అవకాశాలు లేవా..?

సీతారామం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన బాలీవుడ్ భామ మృణాల్ ఠాకూర్ ఆ సినిమా సక్సెస్ అవ్వడమే కాదు ఆమెకు కెరీర్ లో ఒక మంచి జోష్ ఇచ్చింది. ఆ సినిమా తర్వాత హిందీలో కూడా మృణాల్ కి వరుస ఆఫర్లు వస్తున్నాయి. ఇక తెలుగులో కూడా సీతారామం సీతామహాలక్ష్మి గా ప్రేక్షకుల మనసులు గెలుచుకుంది. ఆఫ్టర్ సీతారామం నానితో హాయ్ నాన్న సినిమా చేసి అది కూడా హిట్ సాధించింది మృణాల్. నానితో మృణాల్ చేసిన హాయ్ నాన్న ఎమోషనల్ ఎంటర్టైనర్ గా వచ్చింది. సినిమాలో మ్యూజిక్ కూడా ప్రేక్షకులకు బాగా ఎక్కేసింది. వచ్చీరాగానే రెండు హిట్ సినిమాలు చేసిన మృణాల్ ని తెలుగు ఆడియన్స్ స్టార్ క్రేజ్ ఇచ్చేస్తారు అనుకున్నారు. ఐతే థర్డ్ అటెంప్ట్ గా అమ్మడు విజయ్ దేవరకొండతో ది ఫ్యామిలీ స్టార్ సినిమా చేసింది. ఆ సినిమాలో తన పోర్షన్ వరకు మెప్పించినా ఓవరాల్ గా సినిమా వర్క్ అవుట్ అవ్వకపోవడంతో ఫ్లాప్ అయ్యింది. రెండు హిట్లు పడ్డాక పాపులర్ అయిన మృణాల్ మొదటి ఫ్లాప్ కి షాక్ అయ్యింది. అయితే ఆ తర్వాత ఛాన్స్ లు కూడా రావట్లేదు. మరోపక్క హిందీలో ఇప్పుడు వరుస సినిమాలతో



బిజీ అవుతుంది మృణాల్ ఠాకూర్. ఒకేసారి తెలుగు ఆఫర్, హిందీ ఆఫర్ వస్తే హిందీనే పిక్ చేసుకుంటుందట మృణాల్ ఠాకూర్. అంతేకాదు తెలుగులో రెమ్యునరేషన్ ఇంకా ఎక్కువ కావాలని డిమాండ్ చేస్తుందని కూడా చెబుతున్నారు. ఐతే బాలీవుడ్ లో మృణాల్ ఆల్రెడీ క్రేజ్ కొనసాగిస్తుంది కాబట్టి అక్కడ భారీగానే పారితోషికం అందుకుంటుందని తెలుస్తుంది. మరి నిజంగానే మృణాల్ టాలీవుడ్ సినిమాలను రెమ్యునరేషన్ కోసమే కాదంటుందా అనేది క్లారిటీ రావాల్సి ఉంది. ఓ పక్క తన గ్లామర్ తో ఫోటో షూట్స్ చేస్తూ ఫాలోవర్స్ కి పిచ్చెక్కేలా చేస్తున్న మృణాల్ తెర మీద చేసే పాత్రల్లో తన అభినయంతో ఆకట్టుకుంటుంది. మృణాల్ తో కంప్లీట్ గా ఒక రొమాంటిక్ రోల్ చేయిస్తే బెటర్ అని ఆడియన్స్ కోరుతున్నారు. మరి అలాంటి సినిమా ఎవరితో పడుతుంది అన్నది చూడాలి. మృణాల్ ఠాకూర్ మాత్రం తెలుగులో ఎలాంటి అవకాశం వచ్చినా తాను ఎప్పుడూ రెడీ అనేస్తుంది. ఒకటి రెండు సినిమాలు డిస్కషన్ స్టేజ్ లో ఉన్నాయని తెలుస్తుంది. అవి ఏంటన్నది త్వరలో తెలుస్తుంది.




## వీరమల్లు ప్రీ రిలీజ్ ఈవెంట్ ఫిక్స్.. 3 రాష్ట్రాల మంత్రులు వస్తున్నారా?




టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లీడ్ రోల్ లో రూపొందుతున్న హరిహర వీరమల్లు రిలీజ్ కు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఆ సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తున్నారు. క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ దర్శకత్వం వహించిన ఆ సినిమాను మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఏఎం రత్నం నిర్మిస్తున్నారు. అనేక కారణాల వల్ల ఐదేళ్ల పాటు సెట్స్ పై ఉన్న హరిహర వీరమల్లు మూవీ.. ఇప్పుడు జులై 24వ తేదీన వరల్డ్ వైడ్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్ తో బిజీగా ఉన్నారు. సినిమాకు సంబంధించిన అప్డేట్స్ ను రిలీజ్ చేస్తున్నారు. వరుస అప్డేట్స్ తో సినిమాపై బజ్ క్రియేట్ చేస్తున్నారు. ఇప్పుడు ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు మేకర్స్. జులై 21వ తేదీన హైదరాబాద్ లో ముందస్తు విడుదల వేడుక జరగనుంది. అందుకు గాను తాజాగా అధికారికంగా అనౌన్స్ చేశారు మేకర్స్. శిల్పకళావేదికలో 21వ తేదీన సాయంత్రం 6 గంటల నుంచి కార్యక్రమం జరగనుందని వెల్లడించారు. పవర్ ఫుల్ పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. అందులో గుర్రాన్ని స్వారీ చేస్తూ పవన్ కళ్యాణ్ వేరే లెవెల్ లో కనిపించారు. ఆ తర్వాత యుద్ధభూమి వేచి ఉంది.. కానీ ముందుగా, జులై 21న జరగనున్న వేడుక రోజు జెండాలను ఎగురవేద్దామంటూ రాసుకొచ్చారు. సినిమా రిలీజ్ కు మరో వారం రోజులే ఉందని గుర్తు చేశారు. ప్రస్తుతం మేకర్స్ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అయితే ప్రీ రిలీజ్ ఈవెంట్ కు మూడు వేర్వేరు రాష్ట్రాల మంత్రులు హాజరు కానున్నట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యులు పెద్ద సంఖ్యలో వచ్చి పవన్ కు శుభాకాంక్షలు తెలియజేస్తారని ప్రచారం జరుగుతోంది. వారితో పాటు తెలంగాణకు చెందిన కొంతమంది మంత్రులు కూడా ప్రత్యేక కార్యక్రమానికి హాజరవుతారని సమాచారం. ఆ తర్వాత కర్ణాటక ప్రభుత్వానికి చెందిన మంత్రులు కూడా కార్యక్రమానికి హాజరవుతారని కూడా టాక్ వినిపిస్తోంది. అదే సమయంలో ఇప్పటి వరకు హరి హర వీరమల్లు ప్రమోషన్లలో పవన్ కళ్యాణ్ కనిపించలేదు. కానీ ఇప్పుడు ప్రీ రిలీజ్ ఈవెంట్ లో ఆయన అందరి దృష్టిని ఆకర్షించడం ఖాయం. ఆయన స్పీచ్ కోసం అంతా వెయిట్ చేస్తున్నారు.

## ఆ రూల్‌ని బ్రేక్ చేస్తున్న కూలీ, థగ్ లైఫ్?







సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ కూలీ. లోకేష్ కనగరాజ్ అత్యంత భారీ స్థాయిలో ఈ మూవీని రూపొందిస్తున్నాడు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై భారీ చిత్రాల నిర్మాత కళానిధి మారన్ భారీ బడ్జెట్‌తో భారీ స్టార్ కాస్ట్‌తో నిర్మిస్తున్నారు. ఇందులోని కీలక పాత్రల్లో కింగ్ నాగార్జున, కన్నడ స్టార్ ఉపేంద్ర, శృతిహాసన్, రెబా మోనికా జాన్ నటిస్తున్నారు. కీలకమైన గెస్ట్ క్యారెక్టర్‌లో బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్ట్ అమీర్‌ఖాన్ కనిపించనున్నారు. బుట్టబొమ్మ పూజా హెగ్డే మాసీవ్ ఐటమ్ నంబర్‌తో మెస్మరైజ్ చేయబోతోంది. భారీ హంగులతో భారీ స్టార్ కాస్ట్‌తో రూపొందుతున్న ఈ మూవీని లోకేష్ కనగరాజ్ గోల్డ్ స్మగ్లింగ్ నేపథ్యంలో రూపొందిస్తున్నాడు. ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న ఈ సినిమాని ఆగస్టు 14న భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. హిందీ బెల్ట్‌లో ఈ సారి భారీగా విడుదల చేయాలని భావిస్తున్నారు. ఇందు కోసం ప్లాన్‌ని కూడా రెడీ చేశారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన టాక్స్ నడుస్తున్నాయి. ఇక ఇదే తరహాలో మరో సీనియర్ హీరో కమల్ హాసన్ చాలా ఏళ్ల గ్యాప్ తరువాత మణిరత్నంతో కలిసి చేస్తున్న మూవీ థగ్ లైఫ్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. కమల్‌తో పాటు శింబు కీలక పాత్రలో నటించాడు. త్రిష, సాన్య మల్హోత్రా, పంకజ్ త్రిపాఠీ, జోజు జార్జ్ నటిస్తున్నారు. మణిరత్నం, కమల్‌హాసన్ కలిసి కథ అందించిన ఈ మూవీని కమల్, మణిరత్నంలతో కలిసి యంగ్ హీరో ఉదయనిధి స్టాలిన్ నిర్మిస్తున్నారు. సుధీర్ఘ విరామం తరువాత కమల్, మణిరత్నం కలిసి చేస్తున్న సినిమా కావడంతో థగ్ లైఫ్‌పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ మూవీని జూన్ 5న భారీగా పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. హిందీ బెల్ట్‌లోనూ ఈ మూవీని భారీ స్థాయిలో రిలీజ్ చేయబోతున్నారట. ఇందు కోసం రజనీ కూలీ, కమల్ థగ్ లైఫ్ రూల్‌ని బ్రేక్ చేయబోతున్నారని తెలుస్తోంది. తమిళ సినిమాలు 4 వారాల తరువాత ఓటీటీల్లోకి వచ్చేస్తున్న విషయం తెలిసిందే.

అయితే హిందీ బెల్ట్‌లో భారీ స్థాయిలో రిలీజ్ కావాలంటే 8 వారాల తరువాతే ఓటీటీల్లోకి రావాలని బాలీవుడ్ మేకర్స్ రూల్ పెట్టారట. ఈ రూల్‌కు ఈ రెండు సినిమాల మేకర్స్ సై అంటే హిందీ బెల్ట్‌లో మరీ ముఖ్యంగా పీవీఆర్, ఐనాక్స్ వంటి ప్రముఖ థియేటర్ చైన్స్‌లో భారీ స్థాయిలో కూలీ, థగ్ లైఫ్ రిలీజ్ అవ్వడం ఖాయం అని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ రూల్‌కు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే ఓ కొలిక్కి వస్తాయని, అలా వస్తే ఈ రెండు సినిమాలు ఉత్తరాదిలో బారీ స్థాయిలో రిలీజ్ కావడం ఖాయమని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇదే నిజమైతే ఉత్తారాదిలో ఉన్న రజనీ, కమల్ అభిమానులకు పండగే.

## మల్లెపూల అందంతో కీర్తి కిర్రాక్ గ్లామర్ టచ్

రెగ్యులర్ గా సాంప్రదాయత్మక పాత్రల్లో కనిపించే కీర్తి సురేష్, ఇటీవల తన స్టైల్ ట్రెండ్ ను ఒక్కసారిగా మార్చేసింది. ఆమె యాక్టింగ్, పాత్ర ఎంపికలు విశేషంగా ఉంటే.. ఇప్పుడు ఫ్యాషన్ స్టేట్మెంట్ కూడా ఓ లెవల్‌కి వెళ్లిపోయింది. ఇటీవల ఓటీటీలో విడుదలైన 'ఉప్పు కప్పురంబా' సినిమా ప్రమోషన్‌లో పాల్గొన్న కీర్తి లుక్ చూసి నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. సంప్రదాయ దుస్తులతో ట్రెండీ లుక్‌ని మిక్స్ చేస్తూ ఇచ్చిన షాక్ హైలైట్ అయ్యింది. సాధారణంగా చీరకట్టులో కనిపించే కీర్తి ఈసారి సరికొత్త లుక్‌తో ఫ్యాషన్ లవర్స్‌కి టాక్ పాయింట్ అందించింది. డెనిమ్ కార్సెట్ టాప్‌తో కలిపిన కాటన్ బ్లూ చీర, తలనిండా మల్లె పూలతో జడ, గోల్డ్ బ్యాంగిల్స్, నెక్లెస్ వంటి ఆభరణాలు ఆమె లుక్‌ను మరింత హైలైట్ చేశాయి. ఈ మిక్స్ ట్రెడిషనల్ లుక్‌తో



సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. సింపుల్‌గా ఉండే కీర్తి ఇంతగానూ గ్లామరస్‌గా మారిపోవడం ఓ మెజిక్‌లా ఉందంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. తాజాగా విడుదలైన 'ఉప్పు కప్పురంబా' చిత్రానికి సంబంధించిన ప్రమోషన్లలో పాల్గొన్న కీర్తి, ఈ స్పెషల్ లుక్‌తో అభిమానులను అలరించింది. చీరకట్టులో మోడర్న్ టచ్ ఇచ్చినప్పటికీ, మల్లె పూల జడతో సంప్రదాయ శైలికి న్యాయం చేసింది. ఈ లుక్‌లో ఆమె స్పష్టంగా చెప్పకుండానే ఓ సందేశాన్ని ఇచ్చిందన్నట్టుగా ఉంది. స్టైల్‌లో కూడా తన మార్క్ ఉంటుంది అని. కీర్తికి ఇది ఒక ఫ్యాషన్ టర్నింగ్ పాయింట్ అనే చెప్పాలి. చీరలో గ్లామర్ టచ్ ఎలా ఇస్తారో చూపించడమే కాకుండా, ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ కూడా పెంచింది. కీర్తి సురేష్ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. రివాల్వర్ రీటా వంటి తమిళ చిత్రాలతో పాటు బాలీవుడ్‌లో కూడా దూసుకుపోతోంది. తెలుగులో ప్రస్తుతం కొత్త ప్రాజెక్టులపై చర్చలు జరుపుతోందన్న టాక్ ఉంది.

## రాజు గారికి కలిసి వచ్చేలా ఇవానా సక్సెస్ ..!

ఒక సినిమా సక్సెస్ అయితే ఆ సినిమాకు పనిచేసిన వారందరికీ మంచి జోష్ ఇస్తుంది. అంతేకాదు ఆ హిట్ వల్ల నెక్స్ట్ త్వరగా అవకాశాలు వస్తాయి. ఆల్రెడీ సెట్స్ మీద ఉన్న సినిమాలకు ఇంకాస్త బజ్ పెరుగుతుంది. ఐతే లేటెస్ట్ గా ఒక సినిమా హిట్ తో అగ్ర నిర్మాత దిల్ రాజుకి కూడా కలిసి వచ్చేలా ఉంది. ఇంతకీ అసలు ఇక్కడ మ్యాటర్ ఏంటంటే తమిళ్ లో సక్సెస్ అయిన లవ్ టుడే సినిమాను తెలుగులో డబ్ చేసి రిలీజ్ చేశాడు దిల్ రాజు. ఆ సినిమా యూత్ ఆడియన్స్ కి విపరీతంగా నచ్చేసింది. తెలుగులో కూడా సినిమా హిట్ అయ్యింది. ప్రదీప్ రంగనాథ్, ఇవానా జంటగా నటించిన లవ్ టుడే తెలుగులో కూడా సక్సెస్ అవ్వడంతో వెంటనే దిల్ రాజు ఇవానాని తన నెక్స్ట్ సినిమా లో తీసుకున్నారు. తన ఇంటి వారసుడు ఆశిష్ హీరోగా తెరకెక్కిస్తున్న సెల్ఫిష్ సినిమాలో ఇవానా హీరోయిన్ గా



నటించింది. విశాల్ కాశి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా డిఫరెంట్ కథతో రాబోతుందని తెలుస్తుంది. సినిమా నిర్మాణంలో సుకుమార్ రైటింగ్స్ కూడా భాగం అవుతున్నాడు. ఈ సినిమా ఎప్పుడో రిలీజ్ అవ్వాల్సి ఉన్నా ఆశిష్ తో లవ్ మీ అనే సినిమా తీసి దాన్ని ముందు రిలీజ్ చేశారు. ఐతే సెల్ఫిష్ అవుట్ పుట్ పై దిల్ రాజు అంత సాటిస్ఫైడ్ గా లేరని అందుకే సినిమా రిలీజ్ ఆపారని తెలుస్తుంది. ఐతే లేటెస్ట్ గా ఇవానా శ్రీవిష్ణుతో సింగిల్ సినిమా చేసింది. ఆ సినిమా సూపర్ హిట్ టాక్ తో దూసుకెళ్తుంది. లవ్ టుడే డబ్బింగ్ సినిమా తో ఇవానా తెలుగు సక్సెస్ అందుకోగా స్ట్రైట్ గా సింగిల్ తో కూడా హిట్ అందుకుంది. సో ఇవానా హిట్ మేనియా కచ్చితంగా సెల్ఫిష్ సినిమాకు కలిసి వస్తుందని చెప్పొచ్చు. అందుకే సెల్ఫిష్ సినిమాపై దిల్ రాజు ఫోకస్ చేస్తున్నారని తెలుస్తుంది. ఆశిష్ ఈమధ్యనే మరో సినిమా మొదలు పెట్టాడు. దిల్ రాజు, శిరీష్ లు ఎలాగైనా ఆశిష్ ని హీరోగా నిలబెట్టాలని గట్టి ప్రయత్నం చేస్తున్నారు. సెల్ఫిష్ నుంచి రిలీజైన సాంగ్ కూడా బాగానే క్లిక్ అయ్యింది.ఇవానా లక్ సెల్ఫిష్ టీం కు కలిసి వస్తుందా లేదా అన్నది చూడాలి.




## భారీ వర్షం.. మూడు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు..

హైదరాబాద్, జులై 18: నగరంలో భారీ వర్షం కురుస్తోంది. ఇలాంటి వేళ నగరవాసులకు హైడ్రా హెచ్చరికలు జారీచేసింది. అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దంటూ సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరించింది. ఇక, హైదరాబాద్‌లో మరో గంటపాటు భారీ వర్షం పడే అవకాశం ఉంది. షేక్ పేట్, ఖాజాగూడ, రాయదుర్గం, గచ్చిబౌలిలో భారీ వర్షం కారణంగా జనం అవస్థలు పడుతున్నారు. కొండాపూర్, హఫీజ్ పేట్, మాదాపూర్, మియాపూర్ లో భారీ వర్షం పడింది. రోడ్లపై ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోయింది. ఐటీ కారిడార్‌లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆఫీసు నుంచి ఇళ్లకు వెళ్లే టైమ్ కావడంతో ఫుల్ ట్రాఫిక్ కనిపిస్తోంది. రాయదుర్గం, షేక్ పేట్ మార్గంలో 3 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పద్మవ్యూహంలో ఐటీ కారిడార్ ఉంది. కొన్ని రోడ్లు నాలాలను తలపిస్తున్నాయి. రాయదుర్గం, బయోడైవర్సిటీ, ఐకియా జంక్షన్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. గచ్చిబౌలి పిజేఆర్ ఫ్లైఓవర్ పై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఏఎంబీ మాల్ ముందు వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. హఫీజ్ పేట్, ఆల్విన్ కాలనీ, చందానగర్ మార్గంలో ఫుల్ ట్రాఫిక్ ఉంది. హైటెక్ సిటీ, కెపీహెచ్‌బీ మార్గంలో భారీగా ట్రాఫిక్ ఉంది. ఐటీ కారిడార్ రోడ్లు స్విమ్మింగ్ పూల్స్ ను తలపిస్తున్నాయి. టోలిచౌకి, మెహదీపట్నం మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. కిలోమీటరు ప్రయాణానికి గంటకు పైగా సమయం పడుతోంది. టోలిచౌకి నానల్ నగర్ జంక్షన్ వద్ద నాలా పొంగిపొర్లుతోంది. వరద ప్రవాహానికి వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గ్రేటర్ లో 7.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరో రెండు గంటలపాటు నగరవ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని సమాచారం అందుతోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ జీహెచ్ఎంసీ హెచ్చరికలు జారీ చేసింది. అటు, సంగారెడ్డి జిల్లాలోనూ పలు చోట్ల భారీ వర్షం కురుస్తోంది. సంగారెడ్డి, పఠాన్ చెరు, ఆర్సీ పురం, జిన్నారం, సదాశివపేట మండలంలో భారీగా వర్షం కురుస్తోంది.

## అక్కున చేర్చుకున్న పాలమూరుకు కేసీఆర్ చేసిందేమిటి?: సీఎం రేవంత్‌రెడ్డి

కొల్లాపూర్: తెలంగాణలోని ప్రాజెక్టులకు ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ సీఎం అయ్యాక ఎక్కువ అన్యాయం జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. పాలమూరు ప్రజలు ఆయన్ను అక్కున చేర్చుకుని ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతానికి ద్రోహం చేశారని మండిపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం జటప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అత్యంత వెనుకబడిన కొల్లాపూర్ ప్రాంతానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. "పాలమూరు బిడ్డలు కేసీఆర్‌ను అక్కున చేర్చుకుని పార్లమెంట్‌కు పంపారు. సీఎం అయిన తర్వాత ఈ గడ్డకు ఆయన చేసిందేమిటి?శ్రీశైలం ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులకు ఎందుకు న్యాయం చేయలేదు. జీవో 98 ద్వారా ఇవ్వాల్సిన పరిహారం ఎందుకు ఇవ్వలేదు. వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్పిస్తామని చెప్పి కేసీఆర్ మాట తప్పారు. అలంపూర్, అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల్లో ఉన్న ఈ వర్గాలకు ఎందుకు న్యాయం చేయలేదు. కరీంనగర్ నుంచి పారిపోయి పాలమూరు వస్తే అండగా నిలబడ్డాం. పదేళ్ల పాలనలో ఈ ప్రాంతానికి సున్నం పెట్టింది మీరు కాదా? ఇప్పుడు దుఃఖం వస్తోందని కేసీఆర్ అంటున్నారు. మాదిగల పిల్లలకు వైద్య విద్య సీట్లు వస్తుంటే దుఃఖం వస్తోందా? పాలమూరు బిడ్డ 20 ఏళ్లు సీఎంగా ఉండాలని ఈ జిల్లా కంకణం కట్టుకున్నందుకు దుఃఖమొచ్చిందా? పాలమూరు వాసులు చేపలు పట్టుకోవాలి.. చెప్పులు కుట్టుకోవాలా? మీ పిల్లలు రాజ్యాలు ఏలాలా? పాలమూరు పచ్చగా మారుతుంటే ఎందుకంత విషం చిమ్ముతున్నావు? ఈ జిల్లా అంటే



ఎందుకింత చిన్నచూపు? కేసీఆర్‌కి మద్దతిస్తున్న ఆ పార్టీ జిల్లా నేతలు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డికి సిగ్గుండాలి. భారత రాష్ట్ర సమితి పదేళ్ల పాలనలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఎందుకు పూర్తిచేయలేదు? కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్, జూరాల ప్రాజెక్టుల పరిస్థితి ఏమైంది? ఒక్క కాళేశ్వరం కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారు. 2019లో కడితే.. 2023లో అది కూలింది. చిన్నగుడిసె వేసుకునేవాడు అయినా పదేళ్లు ఉండేట్టు నిర్మించుకుంటాడు. ఉమ్మడి జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణకు ఎన్ని వందలకోట్లు ఖర్చు అయినా.. ఈ ఏడాది డిసెంబర్ 9లోపు నిర్వాసితులకు నష్టపరిహారం ఇచ్చి భూమి సేకరిస్తాం. రానున్న రెండేళ్లలో ఆ ప్రాజెక్టులు పూర్తిచేయాలని నిర్ణయించాం"అని రేవంత్‌రెడ్డి అన్నారు.




ఖమ్మం: తనపై టన్నుల కొద్దీ కేసులు పెట్టారని.. చివరికి గుండు సూదంత ఆధారం చూపలేదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఖమ్మంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పార్టీ నేతలతో కలిసి మాట్లాడారు. ధైర్యం ఉంటే ఏం ఆధారాలు ఉన్నాయో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. "దుబాయ్‌లో ఎవరో చనిపోతే నాకేం సంబంధం. దురలవాట్లకు ప్రజలు దూరంగా ఉండాలి. నేను జీవితంలో ఏనాడూ సిగరెట్ కూడా తాగలేదు. సీఎం రేవంత్‌రెడ్డి నాపై ఎన్నో ఆరోపణలు చేశారు. నేను ఏం చేసినా.. బాజాప్తా చేస్తా. నేను ఏపీ మంత్రి లోకేశ్‌ను కలవలేదు.. ఒక వేళ కలిసినా తప్పేంటి? నారా లోకేశ్ నాకు మంచి మిత్రుడు.. ఆయనతో సత్సంబంధాలు ఉన్నాయి. ఆయన పక్క రాష్ట్రం మంత్రి.. నాకు తమ్ముడి లాంటి వారు. డైవర్షన్ పాలిటిక్స్ తప్ప.. రేవంత్‌రెడ్డి 20 నెలల్లో చేసింది శూన్యం. నా విషయంలో ఓసారి డ్రగ్స్ అంటారు, ఓ సారి కార్ రేసింగ్ అంటున్నారు. రేవంత్‌రెడ్డి వల్ల యూట్యూబర్లకు మినహా ఎవరికీ లాభం చేకూరలేదు. గాసిప్‌ల మాయలో పడి.. ఆరు గ్యారంటీలను మర్చిపోదామా? బనకచర్ల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి అడ్డంగా దొరికిపోయారు. ఢిల్లీ భేటీ అజెండాలో బనకచర్ల అంశమే లేదన్నారు. ఢిల్లీ కేంద్రంగా రాష్ట్రానికి మరోసారి ద్రోహం చేశారు. చంద్రబాబుతో చీకటి ఒప్పందం చేసుకున్నారు. 420 హామీల విషయంలో కాంగ్రెస్‌తో ఫుట్‌బాల్ ఆడటం ఖాయం" అని కేటీఆర్ అన్నారు.

## బాసర సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్‌బాబు



బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని మంత్రి శ్రీధర్‌బాబు దర్శించుకున్నారు. అంతకు ముందు మంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాసర అమ్మవారిని దర్శించుకోవడం తన అదృష్టమన్నారు. మాస్టర్ ప్లాన్, ఆలయ పెద్దల సూచనలతో ఆలయాన్ని తీర్చిదిద్దే కార్యాచరణ తీసుకుంటామని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జ్ఞాన సరస్వతి కొలువుదీరిన ప్రదేశంలో టిపుల్‌ఐటీని నెలకొల్పారని గుర్తుచేశారు. ఈ ప్రాంతాన్ని చదువులకు నిలయంగా నిలపాలనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు.




హైదరాబాద్: తమ ఆస్తులు ఆక్రమణదారులకు చిక్కకుండా ప్రజలే పరిరక్షించుకోవాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పిలుపునిచ్చారు. హైడ్రా తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ అంబర్‌పేటలోని బతుకమ్మకుంట వద్ద విద్యార్థులు, స్థానికులతో కలిసి పెద్దఎత్తున మానవహారం నిర్వహించారు. హైదరాబాద్ కలెక్టర్ హరి చందన, కాంగ్రెస్ నేత వి.హనుమంతరావుతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. వారందరితో నీటి వనరుల పరిరక్షణపై హైడ్రా ప్రతిజ్ఞ చేయించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో బతుకమ్మ సంబురాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇక్కడి నుంచే ప్రారంభిస్తారని తెలిపిన రంగనాథ్.. అందుకు అనుగుణంగా బతుకమ్మకుంటను పూర్తిస్థాయిలో తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు.

**ఏడాదిలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాం..** ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "ఏడాదిలో హైడ్రాకు ఎన్నో మంచి, చెడు అనుభవాలు ఎదురయ్యాయి. విపత్తుల నిర్వహణకు సంబంధించి పక్కా ప్రణాళికతో హైడ్రా పనిచేస్తుంది. ఏడాదిలో 500 ఎకరాల ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాం. హైడ్రా పరిరక్షించిన స్థలాల విలువ దాదాపు రూ.30 వేల కోట్లపైనే ఉంటుంది. ఆరు చెరువులను పునరుద్ధరిస్తున్నాం, వాటి విస్తీర్ణం రెట్టింపు స్థాయిలో పెరిగింది. రహదారులపై, మూసీలో వృథాగా పోయే నీటిని చెరువుల్లోకి మళ్లిస్తున్నాం. ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలు, నాలాలను పరిరక్షిస్తున్నాం. న్యాయపరమైన సవాళ్లను కూడా అధిగమిస్తూ భూములను కాపాడుతున్నాం. కూల్చడమే కాదు నిర్మాణం చేయాలనేది సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్ష. రాబోయే రోజుల్లో పెద్ద సంఖ్యలో చెరువులను హైడ్రా అభివృద్ధి చేస్తుంది. చెరువులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు.

**ఒవైసీ కళాశాలపైనే పదేపదే ఎందుకు ప్రశ్నిస్తున్నారు..** ఆక్రమణలను నివారించడంతో పాటు.. హైడ్రా రాకముందు నిర్మించుకున్న ఇళ్లకు మినహాయింపు ఇచ్చాం. ప్రభుత్వం హైడ్రాకు ఒక నిర్దిష్టమైన విధానాన్ని సూచించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగానే హైడ్రా పనిచేస్తుంది. ఆక్రమణల వెనుక చాలా మంది పెద్దవాళ్లు ఉంటారు. వాళ్లు తప్పించుకోవడానికి పేదలను బుల్డోజర్ల ముందు పెడుతున్నారు. పేదవాళ్ల మీద హైడ్రా పగబట్టిందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయిస్తున్నారు. రూ.30-40 కోట్ల పార్క్ స్థలాన్ని ఆక్రమించే ధైర్యం పేదవాళ్లకు ఉంటుందా. హైడ్రాపై చాలా సార్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మూసీకి సంబంధం లేకున్నా హైడ్రాకు ముడిపెట్టారు. ఒవైసీ కళాశాల విషయంలో మా నిర్ణయాన్ని స్పష్టంగా చెప్పాం. హైడ్రా ఒక సామాజిక కోణంలో పనిచేస్తుంది. ఒవైసీ కళాశాల 2015-16లో నిర్మించారు. కళాశాల ఉన్న చెరువు ప్రాంతానికి 2016లో ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చారు. సల్కం చెరువుకు తుది నోటిఫికేషన్ ఇంకా ఇవ్వలేదు. నగరంలోని 80 శాతం చెరువులకు తుది నోటిఫికేషన్ ఇంకా జారీ చేయలేదు. 140 చెరువులకు మాత్రమే తుది నోటిఫికేషన్ ఇచ్చారు. 540 చెరువులకు పదేళ్ల కిందట ప్రాథమిక నోటిఫికేషన్ మాత్రమే ఇచ్చారు. సల్కం చెరువు నోటిఫికేషన్ ప్రాసెస్‌లో ఉండగా ఎవరికి వారు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. అనధికారిక నిర్మాణాలను తప్పకుండా తొలగిస్తాం. ఒవైసీ కళాశాలపైనే పదే పదే ఎందుకు ప్రశ్నిస్తున్నారు. ఆ కళాశాలపై ఎందుకు అంత ఆసక్తి?ఏ వర్గం కళాశాల అయినా ఒకటే రూల్ వర్తిస్తుంది. సామాజిక కోణంలో కూడా ఆలోచించాలి. హైడ్రా ఏడాది కిందట వచ్చిన సంస్థ.. అంతకుముందు కట్టిన వాటికి కూడా ఒకటే రూల్ ఉండాలనేది సరైన పద్ధతి కాదు" అని కమిషనర్ రంగనాథ్ అన్నారు.

## యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ విస్తరణ.. టెండర్లు పూర్తి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: వరంగల్ విమానాశ్రయానికి కేంద్రం సిద్ధంగా ఉన్నప్పటికీ గత ప్రభుత్వం భూమి ఇవ్వలేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "తెలంగాణలో హైదరాబాద్ మినహా ఇతర పట్టణాల్లో విమానాశ్రయాలు లేవు. కేంద్రం ఎన్ని సార్లు అడిగినా గత ప్రభుత్వం భూమి ఇవ్వలేదు.

కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని కేంద్రం వేగంగా పూర్తి చేస్తోంది. కాజీపేట యూనిట్‌ను కోచ్, వ్యాగన్ల నుంచి ఇంజిన్ల తయారీ వరకు విస్తరిస్తున్నాం. బడ్జెట్ కూడా రూ.200 కోట్లతో ప్రారంభమై మరో రూ.200 కోట్లు పెరిగింది.

కాజీపేట రైల్వే పరిశ్రమతో దాదాపు 3వేల ఉద్యోగాలు వస్తాయి. రాష్ట్రానికి అనేక కొత్త రైళ్లు మంజూరు అవుతున్నాయి. జోధ్‌పూర్, కచ్, అహ్మదాబాద్‌కు నేరుగా రైలు సర్వీసులు వస్తాయి. ఎంఎంటీఎస్‌ను యాదగిరిగుట్ట వరకు విస్తరించాలని నిర్ణయించాం. ఎంఎంటీఎస్ విస్తరణకు టెండర్లు పూర్తయ్యాయి" అని కిషన్‌రెడ్డి తెలిపారు.




హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల వద్ద ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం జరిగింది. ఈరోజు తెల్లవారుజామున 3గంటల సమయంలో లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో ఇద్దరు చనిపోయారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కారులో చిక్కుకుపోయిన మృతదేహాలను బయటకు తీశారు. మృతులను మాలోత్ చందులాల్ (29), గుగులోత్ జనార్దన్ (50), కావలి బాలరాజు (40), జాడ కృష్ణ, దాసరి భాస్కరరావుగా గుర్తించారు.

## రాష్ట్రంలోని హైడల్ ప్రాజెక్టులను పర్యవేక్షిస్తున్నాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నాగార్జునసాగర్: రాష్ట్రంలోని హైడల్ ప్రాజెక్టులన్నింటినీ పర్యవేక్షిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆధునీకరణ జరగాల్సి ఉందని చెప్పారు. నాగార్జునసాగర్ హైడ్రో పవర్‌ప్లాంట్‌ను భట్టి విక్రమార్క సందర్శించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. "ఏడాదిలో 2వేల మెగావాట్ల అధిక విద్యుత్ డిమాండ్ ఏర్పడింది. ఎలాంటి ఆటంకాలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతోంది. అంచనాలకు మించి విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. హరిత విప్లవం కోసం కాంగ్రెస్ అనేక ప్రాజెక్టులు నిర్మించింది. ప్రపంచదేశాలకు పంట ఉత్పత్తులు ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణ ఎదిగింది" అని భట్టి విక్రమార్క అన్నారు.




కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక నిర్ణయం తీసుకున్నారు. అభివృద్ధి పనుల నిమిత్తం ఒక్కో ఎమ్మెల్యేకు రూ.50 కోట్ల గ్రాంట్ విడుదల చేసేందుకు ఆమోదం తెలిపారు. పార్టీలో అంతర్గతంగా జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం ఈ మొత్తాన్ని ఇచ్చేందుకు సీఎం అంగీకరించారు. తమ నియోజవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు సరిపోవడం లేదని కర్ణాటక పార్టీ ఇంఛార్జి రణదీప్ సూర్జేవాలా వద్ద ఇటీవల ఎమ్మెల్యేలు మొరపెట్టుకున్నారు. బెంగళూరులోని పార్టీ ఆఫీస్‌లో విడివిడిగా ఒక్కో ఎమ్మెల్యే ఆయనతో మాట్లాడారు. నిధుల జాప్యంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైన ప్రాజెక్టులు కుంటుపడుతున్నాయని చెప్పారు. ఈ విషయాన్ని సూర్జేవాలా సీఎం, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీనిపై అంతర్గతంగా జరిగిన చర్చ అనంతరం.. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కేటాయింపుల విడుదలకు ముఖ్యమంత్రి అంగీకరించారు. దీంతో ప్రతి ఎమ్మెల్యే రూ.50 కోట్ల గ్రాంట్‌ను పొందనున్నారు. ఇదిలా ఉంటే.. నిధుల విడుదలలో జాప్యంపై ఎమ్మెల్యేల్లో కొద్దికాలంగా తీవ్ర అసహనం నెలకొంది. ఈ విషయమై గత నెల కాగ్వాడ్ ఎమ్మెల్యే రాజు కగే.. సొంత ప్రభుత్వంపై బహిరంగంగా అసహనం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు ముందుకు సాగడంలేదని, ఈ వైఫల్యంపై తాను నిరాశ చెందానని విమర్శలు చేశారు. అలాగే రాజీనామాకు సిద్ధపడ్డారు. ఈ క్రమంలోనే తాజా నిర్ణయం వెలువడింది. ఇదిలా ఉంటే.. కొద్దిరోజులుగా కర్ణాటక రాజకీయాలు చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు ఉంటుందని ప్రచారం జరుగుతుండటం, అగ్రనాయకులు వాటిని తోసిపుచ్చుతున్న పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మరోపక్క, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతు కోసం ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంలు బేరసారాలు మొదలుపెట్టారని భాజపా ఆరోపిస్తోంది. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు వాళ్లిద్దరూ సిద్ధంగా ఉన్నారని విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు భాజపా ప్రయత్నాలు చేస్తోందని ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే చేసిన వాదనను తోసిపుచ్చుతూ.. ఈ విధంగా స్పందించింది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com